

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 23-03-2025 | సంపుటి - 22 | సంచిక - 329 | రూ : 4 | పేజీలు: 8




## తాత్కాలిక వలసదారులపై ట్రంప్ కొరడా

- 5.32 లక్షల మందికి నివాస హోదా రద్దు!

మియామీ: అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి వారిని స్వదేశాలకు పంపిస్తోన్న అమెరికా ఇప్పుడు తాత్కాలిక వలసదారులకున్న చట్టపరమైన నివాస హోదాను రద్దు చేయాలని నిర్ణయించింది. దీనివల్ల నాలుగు దేశాలకు చెందిన 5.32 లక్షల మంది వారి స్వదేశాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఎదురుకానుంది. క్యూబా, హైతీ, నికరాగువా, వెనెజువెలా దేశాల నుంచి వచ్చిన వలసదారులకు చట్టపరంగా ఉన్న తాత్కాలిక రక్షణను రద్దు తరువాయి 2లో

## బెయిల్‌పై పోసాని విడుదల

గుంటూరు: సినీ నటుడు, వైకాపా మాజీ నేత పోసాని కృష్ణమురళి శనివారం గుంటూరు జిల్లా జైలు నుంచి షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యారు. సీఎం చంద్రబాబు ఫొటోలను మార్ఫింగ్ చేసి, ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కూడా దుర్భాషలాడుతూ గతంలో పోసాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులో శుక్రవారం జడ్జి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

తరువాయి 2లో



## కాలిన నోట్లకట్టల ప్రస్తావన?

* జస్టిస్ యశ్వంత్ వర్మపై ఢిల్లీ సీజే సమర్పించిన నివేదికలో వివరాలు!
* నగదు ఆరోపణల్లో వాస్తవం లేదు: జస్టిస్ యశ్వంత్ వర్మ

ఢిల్లీ: అగ్ని ప్రమాదం సందర్భంగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలపై ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ.. శనివారం 25 పేజీల నివేదికను సుప్రీంకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సమర్పించారు. అందులో జస్టిస్ యశ్వంత్ వర్మ వివరణతోపాటు ఢిల్లీ పోలీసు కమిషనరు అందించిన వివరాలు, ఫొటోలు, వీడియోలు ఉన్నాయి. ఈ నివేదిక మొత్తాన్ని అనూహ్యంగా శనివారం రాత్రి తన వెబ్‌సైట్‌లో సుప్రీంకోర్టు ఉంచింది. నివేదికలో అంతర్గత విచారణ ప్రక్రియ వివరాలూ ఉన్నాయి. అగ్ని మాపకశాఖ ఆపరేషన్

తరువాయి 2లో





## నీటి నిల్వతో భవితకు బంగారు బాట

- 1.55 లక్షల పంట కుంటలతో ఒక టీఎంసీ నీళ్లు అందుబాటులోకి
- నాకు కూడా పని లేకపోతే ఉపాధి కూలీగా వెళతా
- త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తా: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

కర్నూలు: నీటి నిల్వతో భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.55 లక్షల పంట కుంటల ద్వారా ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసుకోవచ్చని చెప్పారు. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో పంట కుంట నిర్మాణ పనులకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. కుంటను ఉపాధి కూలీలతో కలిసి లాంఛనంగా తవ్వి, రాష్ట్రవ్యాప్తంగా తరువాయి 2లో






## దక్షిణాదికి తీవ్ర నష్టం

- పునర్విభజన చేసే పక్షంలో లోక్‌సభలో పెరగనున్న సీట్లలో మా రాష్ట్రాలకు 33% ఇవ్వండి
- సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్: ''లోక్‌సభలో సీట్ల సంఖ్యను జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే అది దక్షిణాదికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. మేం దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోం. ఎందుకంటే అది దక్షిణాది రాష్ట్రాల

తరువాయి 2లో

## 25, 30 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల : శ్రీవారి ఆల యంలో 25, 30వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తితిదే శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. 25న కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం, 30న ఉగాది పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. దీంతో 24, 29వ తేదీల్లో ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను ఈ నెల 23న స్వీకరించి 24న దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపింది.





## మళ్లీ గ్రామాలకు రెవెన్యూ ఉద్యోగులు

* 10,954 గ్రామ పాలనాధికారుల పోస్టులు మంజూరు చేసిన ఆర్థికశాఖ
* ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా విధులు
* పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలకు అవకాశం..!
* ఇప్పటికే వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ
* మిగిలిన పోస్టులకు ప్రత్యక్ష నియామకాలు

హైదరాబాద్: గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకు గ్రామ పాలనాధికారి (జీపీవో) పేరుతో కొత్త అధికారులను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ నెల 6న ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం వీరి నియామకానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం 10,954 జీపీవో పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భూమి హక్కులు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జారీ విచారణలు, పథకాలకు అర్హుల ఎంపిక, భూ సర్వేలో సహాయం, విపత్తుల సమాచారం అందజేత, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చేసే కీలక బాధ్యత

తరువాయి 2లో

## కాంగ్రెస్, భాజపాలతో అణా పైసా పనికాలేదు




- ఈ విషయంపై తెలంగాణ సమాజం ఆలోచించాలి
- భారాస కార్యకర్తల సమావేశంలో కేసీఆర్

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది మంది భాజపా, ఎనిమిది మంది కాంగ్రెస్ సభ్యులను ప్రజలు గెలిపిస్తే, తెలంగాణకు అణా పైసా పనికూడా కాలేదని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి భారాస ఎంపీలను పార్లమెంటుకు పంపించి ఉంటే కొట్లాడి మన హక్కులను కాపాడుకునే అవకాశం ఉండేదన్నారు. ''మన దగ్గర ఎంపీల బలం ఉంటే.. కేంద్రం మీద ఒత్తిడి చేసి రాష్ట్రాన్ని బాగుచేసుకునే అవకాశం ఉంటుంది.

తరువాయి 2లో

# దక్షిణాదికి తీవ్ర నష్టం

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ కుదింపు అవుతుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంచేశారు. ''ఒకవేళ కేంద్రంలోని భాజపా పునర్విభజన ప్రక్రియను తప్పనిసరిగా చేయాలనుకుంటే లోక్‌సభలో పెరగనున్న సీట్లలో దక్షిణాది రాష్ట్రాలకు 33% సీట్లు ఇవ్వాలనేది మా ప్రధాన డిమాండ్. ప్రస్తుతం 543 సీట్లున్న లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య 130. ఇది మొత్తం సీట్లలో 24%. పునర్విభజనతో 50% సీట్లను పెంచాలనుకుంటే 272 సీట్లు అదనంగా పెరుగుతాయి. అప్పుడు మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్య 815 అవుతుంది. అందులో దక్షిణాదికి 33% అంటే 272 సీట్లు ఇవ్వాలి. లేదంటే వచ్చే పాతికేళ్ల పాటు లోక్‌సభ సీట్ల సంఖ్యలో మార్పు చేయవద్దు'' అని ఆయన సూచించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో శనివారం నిర్వహించిన 'న్యాయమైన పునర్విభజన'(ఫెయిర్ డీలిమిటేషన్) సంయుక్త కార్యాచరణ కమిటీ తొలి సమావేశంలో రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే... ''జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే విధానానికి కేంద్రం స్వస్తి చెప్పాలి. దేశ నిర్మాణంలో 1975 నుంచి 2025 వరకు అందించిన సేవలకు మనల్ని అభినందించాలి. మనకు వెనక్కి కొంత చెల్లించాలి. జనాభా దామాషా ప్రాతిపదికన చేసే పునర్విభజన చేపట్టొద్దని దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. దేశంలోని ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ సీట్లను ఏర్పాటు చేసినట్లే దక్షిణాదికి అవకాశమివ్వాలి. మంచి ప్రగతి సాధించిన దక్షిణాదికి పార్లమెంటు సీట్లలో మంచి వాటా ఇవ్వడం ద్వారా ఇతర రాష్ట్రాలు ఆర్థికవృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించేలా చేయాలి. ఈ సీట్లను దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలకు ఇప్పుడున్న నిష్పత్తి ప్రాతిపదికన పంచవచ్చు.

దేశంలో మిగిలిన సీట్లను ఉత్తరాది, ఇతర రాష్ట్రాలకు కేంద్రం తమ అభిమతం మేరకు పంచవచ్చు. అనుకున్న దానికంటే దక్షిణాదికి సీట్ల సంఖ్య తగ్గిస్తే అది దేశ రాజకీయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు సైతం రాజకీయ విభేదాలను విస్మరించి పునర్విభజనలో మన వాటా దక్కించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని విన్నవిస్తున్నా. పునర్విభజన ప్రక్రియపై తెలంగాణ శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తాం. మీ రాష్ట్రాల్లోనూ అలానే చేయాలని సహచర ముఖ్యమంత్రులు, నాయకులను కోరుతున్నా. దక్షిణ భారతదేశ పౌరుల గళాన్ని బలంగా దేశం మొత్తానికి వినిపిద్దాం. పునర్విభజన ప్రక్రియపై రెండో సమావేశాన్ని వచ్చే నెలలో హైదరాబాద్‌లో నిర్వహిస్తాను. ఈ పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు భారీ బహిరంగ సభను ఏర్పాటుచేస్తా. దక్షిణ భారత సోదర, సోదరీమణులంతా తరలివచ్చి... మన హక్కుల రక్షణకు కలిసి రావాలని విన్నవిస్తున్నా.

*** భాజపాది జనాభా జరిమానాల విధానం**

జనాభా నియంత్రణపై 1971లో దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని విజయవంతంగా అమలు చేస్తే... ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు విఫలమయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయి. దేశ ఖజానాకు భారీగా నిధులు సమకూరుస్తున్న ఈ రాష్ట్రాలకు తిరిగి.. తక్కువ మొత్తమే దక్కుతోంది. కర్ణాటక పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే కేవలం 14 పైసలు, తమిళనాడుకు 29 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు వెనక్కి వస్తున్నాయి. అదేసమయంలో బిహార్‌కు రూ.6.06, ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.2.73, మధ్యప్రదేశ్‌కు రూ.1.73 వెనక్కి వెళుతున్నాయి. మరోవైపు దక్షిణాదికి కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులను తగ్గిస్తోంది. మనది ఒకే దేశం... మనం దాన్ని గౌరవిస్తాం. పునర్విభజనను మాత్రం అంగీకరించబోం. ఈ అసమగ్రమైన ప్రక్రియను చేపట్టకుండా మనం భాజపాను అడ్డుకోవాల్సిందే.

ఇదీ నా మొదటి సూచన... అసలు సీట్లను పెంచొద్దు. ఉన్న సీట్లతోనే పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి. 1976లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అలానే పునర్విభజన చేపట్టింది. లేకుంటే రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానతలు వచ్చేవి. 2001లో వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను అలానే ప్రారంభించింది. ప్రస్తుతం ప్రధాని మోదీ ఈ విధానాన్ని అమలు చేస్తారా?

నా రెండో సూచన... భాజపా ప్రతి పాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజన చేపడితే మనల్ని ఉత్తరాది వారు ద్వితీయ శ్రేణి పౌరుల స్థాయికి తగ్గిస్తారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనతో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చెలాయిస్తాయని ఇక్కడున్న ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. మనం దీనికి అంగీకరించకూడదు. నా మూడో సూచన... నిష్పత్తి (ప్రొరేటా) విధానాన్ని సైతం అంగీకరించలేం. దీనితోనూ దక్షిణాదికి నష్టమే కలుగుతుంది. ఈ పద్ధతిని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుంది. ఒక్క సీటు కూడా భారీ తేడాను చూపుతుంది. ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మనదేశంలో ఉంది. అందుకే వాజ్‌పేయి పాటించిన విధానాన్నే ప్రధాని మోదీ అనుసరించాలి'' అని రేవంత్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్, భాజపాలతో అణా పైసా పనికాలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికైనా ఈ దిశగా సమాజం ఆలోచన చేయాలి'' అని తెలిపారు. తెలంగాణకు ప్రధాన శత్రువు కాంగ్రెస్సే అని కేసీఆర్ పునరుద్ఘాటించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో..రామగుండం నుంచి ఎర్రవల్లి దాకా 180 కిలోమీటర్ల పాదయాత్ర వారంపాటు సాగి శనివారం ముగిసింది. కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవల్లిలో జరిగిన ముగింపు సభలో గులాబీ అధినేత కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చేస్తుంటే.. కేసీఆర్ అన్నా ఎక్కడున్నావు రావే.. అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ నన్ను ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారు కదా! నేను ఎక్కడికి రావాలి? కత్తి ఒకరికిచ్చి.. యుద్ధం ఇంకొకరిని చేయమంటే ఎట్లా? భారాస హయాంలో పదేళ్లపాటు ప్రశాంతంగా బతికామని.. సమాజం భావిస్తోంది. ఇప్పుడు మళ్లీ పాదయాత్రలు, ధర్నాలు, కొట్లాటలు మొదలయ్యాయి. పాదయాత్రలు కాదు.. మనసు పెట్టి యాత్రలు చేయాలి. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని పాడు చేసుకునేలా కాకుండా.. మరింత బాగు చేసుకునే దిశగా యువత ఆలోచన చేయాలి'' అని ఉద్బోధించారు.

**రైతు సంక్షేమాన్ని ఆకాంక్షించింది భారాస ప్రభుత్వమే**

''తెలంగాణలో మొదటి నుంచీ నీటి సమస్యను ఆర్థిక సమస్యగా చూడటం ఉమ్మడి రాష్ట్ర పాలకులు ఒక అవలక్షణంగా మార్చుకున్నారు. కానీ తెలంగాణ రాగానే.. నాటి భారాస ప్రభుత్వం వ్యవసాయ స్థిరీకరణపై దృష్టి సారించింది. రైతు సంక్షేమాన్ని ఆకాంక్షించి, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించింది. పంటకు పెట్టుబడి సాయం చేసింది. ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే.. కరెంటు పోయింది. తాగునీరు ఇవ్వలేకపోతోంది.. చెరువులు ఎండిపోయాయి. ఎందుకీ పరిస్థితి వచ్చిందో ప్రజలు అర్థం చేసుకోవాలి. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను మొదటి నుంచీ కనీస స్థాయిలో ప్రతిఘటించలేని నాటి నాయకత్వం.. ఇక్కడి ప్రజలకు ఎంతో నష్టం చేసిందనే ఆవేదనతో ఉద్యమకాలంలో నేను వాళ్లను తెలంగాణ సమాజం తరఫున కొన్ని మాటలు అన్నానే తప్ప.. నాకు వ్యక్తిగతంగా ఎవరి మీదైనా కోపం ఎందుకుంటుంది? రాష్ట్రంలో సంపద మీద కొందరు కన్నేసి ఉన్నారు. తెలంగాణలో మళ్లీ చంద్రబాబు, ఎన్డీయే కూటమి రావాలని కొందరు ప్రచారం చేస్తున్నారు. వీరిపట్ల యువత అప్రమత్తంగా ఉండాలి. ఒక పొరపాటు జరిగితే జీవితకాలం బాధపడాల్సి వస్తుంది'' అని కేసీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కొప్పుల ఈశ్వర్, వంటేరు ప్రతాపరెడ్డి, జీవన్‌రెడ్డి, పుట్ట మధూకర్, భారాస కార్యకర్తలు పాల్గొన్నారు.

# మళ్లీ గ్రామాలకు రెవెన్యూ ఉద్యోగులు

(మొదటిపేజీ తరువాయి)

లను ప్రభుత్వం జీపీవోలకు అప్పగించనుంది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేసేలా ఈ పోస్టులను ఏర్పాటు చేస్తోంది.

**పూర్వ వీఆర్ఏ, వీఆర్వోలకు ఐచ్ఛికం**

గతంలో రెవెన్యూశాఖలో గ్రామ రెవెన్యూ సహాయకులు, అధికారులు(వీఆర్ఏ, వీఆర్వో)గా పనిచేసిన వారికి జీపీవో పోస్టుల భర్తీలో ఐచ్ఛికాల ద్వారా అవకాశం ఇవ్వనున్నారు. గత ప్రభుత్వం 2020లో వీఆర్వో, 2022లో వీఆర్ఏ వ్యవస్థలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ ఉద్యోగులను ఇతర ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లకు బదలాయించారు. ప్రస్తుతం జీపీవోలుగా సేవలు అందించాలంటే రెవెన్యూ పాలనపై పట్టున్న వీఆర్ఏ, వీఆర్వోలు మేలని ప్రభుత్వం భావిస్తోంది. రెవెన్యూ సంఘాలు కూడా వారిని తిరిగి రెవెన్యూశాఖలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో డిమాండు చేస్తున్నాయి. ఈ పోస్టుల్లో కొత్త వారిని భర్తీ చేయడం వల్ల ఖజానాపై భారం పడే అవకాశాలు లేకపోలేదు. ఈ కారణంతోనూ ప్రభుత్వం పూర్వ వీఆర్ఏ, వీఆర్వోల వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. మూడు నెలల క్రితమే పూర్వ వీఆర్ఏ, వీఆర్వోల్లో జీపీవో పోస్టులపై ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది.

**ఖాళీ పోస్టుల భర్తీపై..**

వీఆర్వో పోస్టుల రద్దుకు ముందు రాష్ట్రంలో 7,039 పోస్టులు ఉండగా.. 5,195 మంది విధులు నిర్వర్తించేవారు. వీఆర్ఏల రద్దుకు మునుపు 25,750 పోస్టులు ఉండగా 20,255 మంది విధుల్లో ఉండేవారు. వీరిలో 2,500 మంది డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వచ్చినవారు కాగా 61 ఏళ్లు నిండిన వారు 3,767 మంది ఉండేవారు. వీరు మినహా మిగిలిన వారిని వివిధ ప్రభుత్వ శాఖలకు బదలాయించారు. ప్రస్తుతం వెయ్యి మంది సర్వేయర్లు, 10,954 మంది జీపీవోల నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆసక్తి ఉన్న పూర్వ వీఆర్ఏ, వీఆర్వోల నుంచి దరఖాస్తులు కోరగా 9,654 మంది దరఖాస్తు చేశారు. వారిలో ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు ఉన్నవారు 6 వేల మంది వరకు ఉన్నట్లు గుర్తించారు. అయితే, ఎలాంటి షరతులు, రాత పరీక్ష లేకుండా తీసుకోవాలని రెవెన్యూ సంఘాలు డిమాండు చేస్తున్నాయి. కొత్త పోస్టులను సృష్టించి భర్తీ చేస్తున్న నేపథ్యంలో పూర్వ ఉద్యోగులకు నేరుగా అవకాశం కల్పిస్తే న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉంది. దీంతో రాత పరీక్ష ద్వారా అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. ఎంపికలు పోను మిగిలిన పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

**మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు**

జీపీవో పోస్టుల మంజూరు పట్ల రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రెవెన్యూ ఉద్యోగుల ఐకాస నేతృత్వంలో నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఐకాస ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పలు సంఘాలు హైదరాబాద్‌లో ఆయన్ను కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తుండటం పట్ల సీఎంకు, మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహసీల్దార్ల సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. షరతులు లేకుండా రెవెన్యూ పాలనపై అనుభవం ఉన్న వారందరినీ తిరిగి తీసుకోవాలని తెలంగాణ వీఆర్వోల ఐకాస అధ్యక్షుడు గోల్కొండ సతీష్ తదితరులు డిమాండు చేశారు.

# తాత్కాలిక వలసదారులపై ట్రంప్ కొరడా



(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నట్లు హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్లు తెలిపింది. మానవతా పెరోల్ కార్యక్రమం కింద 2022 అక్టోబరు తర్వాత ఆ నాలుగు దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చిన వారికి ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి. వీరంతా ఇతరుల ఆర్థిక సహకారంతో అమెరికాకు వచ్చారని, రెండేళ్ల పాటు యూఎస్‌లో నివసించడానికి, పని చేయడానికి తాత్కాలిక అనుమతులు పొందారని హోమ్‌లాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. వీరు ఏప్రిల్ 24న లేదా ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీసులు ప్రచురించిన 30 రోజుల తర్వాత అగ్రరాజ్యంలో ఉండేందుకు లభించిన చట్టపరమైన రక్షణను కోల్పోనున్నారని తెలిపారు.

**ఒక్క రోజే 1000 గోల్డ్ కార్డుల అమ్మకం**

ఇంటర్నెట్ డెస్క్: డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన గోల్డ్ కార్డుకు భారీ స్పందన లభించింది. ఒక్క రోజే 1000 కార్డులను విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ వెల్లడించారు. వీటి ద్వారా 5 బిలియన్ డాలర్లు సేకరించామని తెలిపారు. లక్షల మంది ఈ కార్డును కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఏప్రిల్ 28న కెనడాలో ఎన్నికలు..!




కెనడా ప్రధానమంత్రిగా మార్క్ కార్నీ ఇటీవల ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన ముందస్తు ఎన్నికలకు సిద్ధమైనట్లు సమాచారం. ఏప్రిల్ 28న ఫెడరల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. కెనడా పార్లమెంటులో మొత్తం 338 స్థానాలున్నాయి. వీటికి ఏప్రిల్ 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు కార్నీ ఆదివారం ప్రకటించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రధాని కార్నీ కెనడా రాజధాని ఒట్టావా నుంచి బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. లిబరల్ పార్టీ శనివారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. జనవరిలో జస్టిన్ ట్రూడో ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో లిబరల్ పార్టీ సభ్యులు తదుపరి ప్రధానిగా కార్నీని ఎన్నుకున్నారు. కొత్త నాయకత్వం ఏర్పడిన తర్వాత గ్లోబల్ న్యూస్ నిర్వహించిన పోల్ సర్వేల్లో ఓటర్లు అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్లు వెల్లడైంది. 42 శాతం మంది ఓటర్లు లిబరల్ పార్టీకి మద్దతివ్వగా.. 36 శాతం మంది కన్జర్వేటర్లకు అనుకూలంగా ఉన్నారు. ఇక 48 శాతం మంది మార్క్ కార్నీ నాయకత్వాన్ని ఆమోదించగా.. 30 శాతం మంది వ్యతిరేకిస్తున్నారట. ఇదిలాఉండగా.. అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో (Mexico) నుంచి వచ్చే దిగుమతులపై మార్చి 4 నుంచి 25శాతం సుంకాలు వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయడంలో విఫలమైతే కెనడా యూఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ చురకలంటించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆ దేశంలో జరగనున్న ఎన్నికలు కీలకంగా మారాయి.

# నీటి నిల్వతో భవితకు బంగారు బాట

(మొదటిపేజీ తరువాయి)

1.55 లక్షల పంట కుంటలు తవ్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి కూడా చిన్నచిన్న నీటి తటాకాలు తవ్వే సంప్రదాయం ఉందని గుర్తుచేశారు. ఆయన హయాంలో మాదిరిగానే రాయలసీమ.. మళ్లీ రతనాల సీమగా మారాలని ఆకాంక్షించారు. ప్రతి రైతు తన పొలానికి అనుబంధంగా పంట కుంటను అభివృద్ధి చేసుకుంటే సాగు నీటితోపాటు అందులో చేపలు, బాతులు పెంచడం, కుంట చుట్టూ మొక్కలు నాటి వాటి నుంచి సైతం కొంత ఆదాయం సమకూర్చుకోవచ్చని పవన్ కల్యాణ్ చెప్పారు. మే నెలాఖరుకల్లా పంట కుంటల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

**ఉపాధి పనులతో అన్నదాతలకు చేయూత**

ఉపాధి హామీ పనులతో అన్నదాతల జీవితాల్లో వెలుగు నిండాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయమని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద 97.44 లక్షల మంది కూలీలకు వారి స్వగ్రామాల్లోనే ఉపాధి చూపగలుగుతున్నామని పేర్కొన్నారు. కష్టపడే ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని లభిస్తుందని.. నాకైనా పని దొరక్కపోతే ఉపాధి కూలీగా మారేందుకు సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. 'గతంలో ప్రపంచ రికార్డు సృష్టించేలా ఒకే రోజు 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాం. అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి ఉండటంతో పల్లె పండగ విజయవంతమైంది. ఉపాధి హామీ బకాయిలు రెండు రోజుల్లో జమయ్యేలా చూస్తాం' అని చెప్పారు. గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రాజకీయ ఉపాధి పథకంగా మార్చిందని విమర్శించారు. లబ్ధిదారులు ఎవరో కూడా తెలియకుండా పనులు చేసిందని మండిపడ్డారు.

**8 నెలల్లోనే 4 వేల కి.మీ. రోడ్లు నిర్మించాం**

వైకాపా ఐదేళ్ల పాలనలో 4,276 కి.మీ. మేర రహదారులు నిర్మిస్తే.. ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కేవలం 8 నెలల్లోనే 4 వేల కి.మీ.ల మేర రహదారులను నిర్మించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఉపాధి హామీ పథకం కింద ఇప్పటివరకు రూ.9,597 కోట్లు వెచ్చించామన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో జన్‌మన్ పథకం కింద ఆదివాసీ గ్రామాలకు రహదారులు నిర్మించడంతోపాటు ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు.

**'కొణిదెల'కు సొంత ట్రస్టు నిధులు**

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని కొణిదెల గ్రామాన్ని సొంత ట్రస్టు నుంచి రూ.50 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేయనున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఆ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని గతంలో ప్రకటించానని, త్వరలోనే ఆ ఊరిని సందర్శిస్తానని చెప్పారు. అన్ని జిల్లాల్లో పర్యటించాలని భావిస్తున్నామని.. గ్రామాలకు వెళ్లినప్పుడు రెండు రోజులు ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. కర్నూలు విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని రెడ్డి సంఘం నాయకులు వినతిపత్రం ఇచ్చారని.. అందుకు తనవంతు కృషి చేస్తానని పవన్ హామీ ఇచ్చారు.

# బెయిల్‌పై పోసాని విడుదల

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ఉదయం ఆయన విడుదల కావాల్సి ఉన్నా సకాలంలో జామీను ఇవ్వకపోవడంతో ఆలస్యమైంది. రూ.2 లక్షల విలువతో ఇద్దరు వ్యక్తులు జామీను ఇవ్వడంతో సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు. ఆయన్ని మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైకాపా నాయకులు పరామర్శించారు.

# కాలిన నోట్లకట్టల ప్రస్తావన?

(మొదటిపేజీ తరువాయి)

వివరాలూ ఫొటోలు, వీడియోల్లో ఉన్నాయి. సీజేఐ రాసిన లేఖ కూడా ఉంది. దిల్లీ హైకోర్టు సీజే సమర్పించిన నివేదికను పరిశీలిస్తే.. సగం కాలిన నోట్ల కట్టలను గురించి అధికారిక ప్రస్తావన కనిపించింది. దీనిపై అధికారిక సమాచారం ఉందన్న విషయం అందులో ఉంది. మరోవైపు స్టోర్ రూంలో తానుగానీ, తన కుటుంబ సభ్యులుగానీ ఎటువంటి నగదును ఉంచలేదని సీజే జస్టిస్ ఉపాధ్యాయకు ఇచ్చిన వివరణలో జస్టిస్ యశ్వంత్ వర్మ పేర్కొన్నారు. తమకు చెందిన నగదు దొరికిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆధారాల ప్రకారం.. ఈ అంశంపై మరింత లోతుగా విచారణ జరగాల్సి ఉందని జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ఆయన శుక్రవారం తెలిపినా శనివారం బయటకు వచ్చింది.

**విచారణకు త్రిసభ్య సంఘం**

దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంపై విచారణ జరపాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నిర్ణయించారు. ఇందు కోసం 3 రాష్ట్రాల హైకోర్టుల న్యాయమూర్తులతో త్రిసభ్య సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పంజాబ్‌హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.ఎస్.సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతానికి జస్టిస్ యశ్వంత్ వర్మకు కేసుల విచారణ పరంగా ఎలాంటి బాధ్యతలూ అప్పగించవద్దని దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయను సీజేఐ ఆదేశించారు.

# భారతరత్న అటల్ బిహారి వాజ్ పెయ్ సంస్కరణలు అమోఘం

* **చౌటుప్పల్ లో అటల్ బిహారి వాజ్ పెయ్ శతజయంతి ఉత్సవాలు**
* **గంగిడి మనోహర్ రెడ్డి**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారి వాజ్ పెయ్ దేశ అభివృద్ధి కోసం చేసిన సంస్కరణలు అమోఘమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి హోటల్ హైవే 9లో బిజెపి మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్ పెయ్ శతజయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ అటల్ బిహారి వాజ్ పెయ్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలోనే గ్రామీణ సడక్ యోజన పథకం ప్రవేశపెట్టాలని గుర్తు చేశారు. మౌలిక వసతుల కల్పనలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ వల్ల భారత్ పలు విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమణగోని శంకర్, మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, ఆలే చిరంజీవి, కాసుల వెంకటేశం గౌడ్, ఊడుగు యాదయ్య గౌడ్, బత్తుల జంగయ్య గౌడ్, చినుకని మల్లేశం యాదవ్, పాలకూర్ల జంగయ్య గౌడ్, శాగ చంద్రశేఖర్ రెడ్డి, ఊడుగు వెంకటేశం గౌడ్, కడారి ఐలయ్య యాదవ్, ముత్యాల భూపాల్ రెడ్డి, వనం ధనంజయ, పిల్ల బుచ్చయ్య, గోశిక పురుషోత్తం, కడవేరు పాండు, తడక సురేఖ, ఊడుగు విజయలక్ష్మి, చేకూరి వెంకటేశం, అమృతం దశరథ, గోశిక బిక్షపతి, పర్నె శ్రీనివాస్ రెడ్డి, వరగంటి భానుప్రకాష్, బొల్లమోని మమత, పెద్దగోని జంగయ్య, బండారు మహేందర్ రెడ్డి, ఊదరి రంగయ్య, శ్రీశైలం బూత్ అధ్యక్షుడు బాతరాజు ప్రవీణ్, ఇటికల దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ దేవాలయానికి మైక్ సెట్ బహుకరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం తంగడపల్లి రోడ్డు లోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ దేవాలయానికి మణికంఠ మిల్క్ సెంటర్ యజమాని చిలువేరు మంగయ్య సుశీలమ్మ దంపతులు శనివారం మైక్ సెట్ బహుకరించారు. శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడు సందగళ్ళ సతీష్ గౌడ్ కు మైక్ సెట్ ను అందజేశారు. దేవాలయానికి మైక్ సెట్ అందజేసిన చిలువేరు మంగయ్య సుశీలమ్మ దంపతులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ఆకాంక్షించారు.

## వెనుకబడిన కులాలను ఎస్సీఎ లో చేర్చడం పట్ల హర్షం

- **తెలంగాణ బేడ బుడగ జంగాల హక్కుల దండు ఆధ్వర్యంలో పాలాభిషేకం**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అత్యంత వెనుకబడిన 15కులాలను ఎస్సీఎ లో చేర్చడం పట్ల చౌటుప్పల్ మండల కేంద్రంలో తెలంగాణ బేడ బుడగ జంగాల హక్కుల దండు చౌటుప్పల మండల ఆధ్వర్యంలో శనివారం హర్షం వ్యక్తం చేశారు. పాలాభిషేకం నిర్వహించారు. తెలంగాణ బేడ బుడగ జంగాల హక్కుల దండు రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి హనుమంతు ఆదేశాల మేరకు చౌటుప్పల్ బస్టాండ్ ఆవరణ జాతీయ రహదారిపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనరసింహ, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రేవల్ల చంద్రయ్య, మండల కమిటీ అధ్యక్షుడు తూర్పాటి శంకర్, ప్రధాన కార్యదర్శి పస్తం యాదయ్య, టి దశరథ, ఎస్ సుదర్శన్, పస్తం గంగరాములు, కె భుజంగం, పి మహంకాళి, ఆర్ లింగస్వామి, పి యాదయ్య, టి జంగయ్య, టి యాదయ్య, పి వెంకటేష్, ఈ నరసింహ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక చైతన్యం కోసం కృషి చేస్తున్న నర్రి స్వామి అభినందనీయం

* **హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ**

యాదాద్రి భువనగిరి , (ప్రజాస్ఫూర్తి) : హైదరాబాదులో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ నీ తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ , చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ కార్యదర్శి, హైకోర్టు ప్రముఖ న్యాయవాది, మునుగోడు నియోజకవర్గం కంటెస్టెండ్ ఎమ్మెల్యే అభ్యర్థి నర్రి స్వామి కురుమ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి లాయర్స్ ఫోరమ్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు.



లాయర్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ క్యాలెండర్ ని ఆవిష్కరించిన అనంతరం హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ నర్రి స్వామి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయుచునే సామాజిక న్యాయం కోసం పోరాటం చేయడం అభినందనీయం అన్నారు విద్యావంతులైన యువకులు సామాజిక చైతన్యం కోసం కృషి చేయడం సమాజానికి శ్రేయస్కరం అన్నారు నర్రి స్వామి మాట్లాడుతూ హర్యానా గవర్నర్ దత్తాత్రేయ లాయర్స్ పోరం క్యాలెండర్ ని ఆవిష్కరించి కేంద్ర ప్రభుత్వం తో మాట్లాడి న్యాయవాద సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలియజేయడం చాలా సంతోషకరమన్నారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, బార్క రాకేష్ సిటీ సివిల్ కోర్టు జాయింట్ సెక్రెటరీ, దయ్యాల మాణిక్ , దయ్యాల రాకేష్, తెలంగాణ సామాజిక చైతన్య వేదిక నాయకులు శ్రీరామ్ , నక్కరాజు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో మత్స్యకారులకు మొండి చేయి చూపిన రేవంత్ రెడ్డి

* **రాజపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పులి చంద్రమౌళి**



రాజపేట, ప్రజా స్ఫూర్తి : అసెంబ్లీలో ఎన్నికల్లో భాగంగా రేవంత్ రెడ్డి బీసీ డెక్కరేషన్ సభలో కాంగ్రెస్ పార్టీ తెలుగు ముదిరాజ్ మత్స్యకారు సంక్షేమ కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తానని హామీ ఇచ్చి తెలుగు ముదిరాజ్ మత్స్యకారులకు బడ్జెట్ కేటాయించకుండా మొండి చెయ్యి చూపించారని రాజపేట మండలం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పులి చంద్రమౌళి విమర్శించారు. శనివారం ఆయనను పోలీసులు ముందస్తు అరెస్టు చేయగా మాట్లాడారు. రాష్ట్రంలో 60 లక్షల మంది తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల అంశాలపై నీళ్లు చల్లిందన్నారు. హామీలను మరచిపోయి అసెంబ్లీ సమావేశాలలో. బీసీ డి నుండి. బీసీ ఏ కు మార్చాలని కనీసం చర్చ కూడా రావడం లేదన్నారు 2024 2025 సంవత్సరం ఉచిత చేప పిల్లలు పంపిణీ కార్యక్రమంలో 90 కోట్ల చేప పిల్లలు ఇస్తామని 50% 40 కోట్లు నాణ్యమైన చేప పిల్లలు ఇస్తామని 19 కోట్ల చేప పిల్లలు మాత్రమే ఇవ్వడం జరిగిందని, కొన్ని జిల్లాల్లో అవి కూడా ఇవ్వలేదని తెలుగు ముదిరాజ్ మత్స్యకారులను మోసం చేసిందని, మత్స్యకారుల సంఘం కోసం కొత్త స్కీములు తీసుకురావాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. మత్స్యశాఖ కార్మికులను మర్చిపోయిన ప్రభుత్వానికి కనువిప్పు చూపే సమయం దగ్గరలోనే మంత్రి పదవి ఇస్తానని ఇప్పటివరకు ఇవ్వలేదని, ఎమ్మెల్సీ పదవులో మొండి చేయి రాష్ట్ర నామినేటెడ్ చైర్మన్ పదవులల్లో కూడా ముదిరాజులకు అవకాశం కల్పించడం లేదన్నారు. ముదిరాజు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఇప్పటివరకు నిధులు కేటాయించలేదని, ముదిరాజ్ ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ సీట్లు సంపాదించుకుంది గాని ముదిరాజులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనగా చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి సిద్ధంగా ఉండగా *రాజపేట మండలం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పులి చంద్రమౌళి ని ఉదయం తన నివాసం దగ్గర ముందస్తు అరెస్టు చేసి *రాజపేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ముదిరాజ్ సామాజిక వర్గ0 ప్రభుత్వాలు హక్కులను కూడా తెలియజేయకుండా గొంతు నొక్కుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి రిజర్వేషన్ కొరకు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పులి చంద్రమౌళి అన్నారు.

## వన్ నేషన్ వన్ ఎలక్షన్ మండల స్థాయి కార్యాశాల సమావేశం



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : వన్ నేషన్ వన్ ఎలక్షన్ మండల స్థాయి కార్యాశాల యాదగిరిగుట్ట మండలం సైదాపురం లో మండల కన్వీనర్ శారాజి లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ చందా మహేందర్ గుప్తా పాల్గొని దేశంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ తో భారతదేశానికి కలిగే ప్రయోజనాలను వివరించి ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు గుంటిపల్లి మహేశ్వరి సత్యనారాయణ జిల్లా కౌన్సిల్ మెంబర్ గంధమల్ల మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు దొంతు భరత్, మండల ప్రధాన కార్యదర్శి కర్రె శ్రీకాంత్, గజం సంతోష్, మండల ఉపాధ్యక్షులు కట్కం మనోహర్, డాక్టర్ ప్రవీణ్, ఏలూరు సత్యనారాయణ, మండల నాయకులు రాజు, చంద్రశేఖర్, గోపగాని ప్రసాద్, గుండా నర్సింహులు, రమేష్ , బూత్ అధ్యక్షులు నల్ల పోశెట్టి, ఏలూరు శ్యామ్, గోవర్ధన్, బాల్ చారి, శేఖర్, శ్రీశైలం, విజయ, భాను, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన రొడ్డ మధు వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న బిజెపి నాయకుడు శాగ చంద్రశేఖర్ రెడ్డి మృతుని కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ. 15వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట చినికుని మల్లేష్, బోయ యాదయ్య, పాలకూర్ల జంగయ్య, అంతటి వేణు, బాతరాజు యాదయ్య, తూర్పింటి రవి, మార్గం వెంకటేష్, బండ శేఖర్ బాతరాజు వెంకటేష్, సిద్ధగోని సంతోష్, బొమ్మల రాజు, పల్లె వెంకటేష్, తూర్పింటి వంశీ, బాతరాజు సాయి ఉన్నారు.

## జోనల్ కమిషనర్ ని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువస్తూ అవి పెండింగ్ లో ఉన్న సమస్యల వారి పరిష్కార కొరకు నిధులు శాంక్షన్ చేయాల్సిందిగా అలాగే వేసవిని దృష్టిలో ఉంచుకుని బాక్స్ డ్రైనేజీ పనులను కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వీలైనంత త్వరలో పైన చూపిన పనులన్నింటికీ నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, చిలుక నగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ , బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్ , తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కళ్లకు నల్ల రిబ్బన్లతో నిరసన..

* **జర్నలిస్టులు ఇంటి స్థలాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న జర్నలిస్టులకు సంఘీభావం**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గత మూడు రోజులుగా ఇంటి స్థలాల కోసం మండేటెండలో నిరాహార దీక్ష చేస్తున్న జర్నలిస్టులు శనివారం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కళ్లకు నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు.ఈ దీక్ష శిబిరాన్ని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ , ప్రజా సంఘాలు బృందం కలిసి మద్దతు తెలియజేయడం జరిగింది.

అనంతరం దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం విలేకరుల కోసం పది ఎకరాల స్థలం కేటాయించగా నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి ఇచ్చిన స్థలం కు గజానికి 4000 చొప్పున కట్టాలని ఆంక్షలు పెడుతుంది ఎలాంటి ఆంక్షలు లేకుండా గతంలో కేటాయించిన మాదిరిగానే ఇళ్ల స్థలాలు జర్నలిస్టులకు ఇవ్వాలని వారు అన్నారు. అధికారంలోకి వచ్చే ప్రతి పార్టీ జర్నలిస్టులను అడ్డుపెట్టుకొని ఇంటి స్థలం ఇస్తామని అనేక హామీలకు వాగ్దానం ఇచ్చి వారిని విస్మరిస్తున్నారు అన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించింది తెలంగాణను తీసుకొచ్చింది తీసుకొచ్చే విధంగా పోరాటంలోకి ప్రజలని ప్రజాస్వామిక వాదనని చైతన్యం చేయడంలో జర్నలిస్టు పాత్రని మరవకూడదని మరిచిపోలేమని వారన్నారు. ఎన్నో త్యాగాలతో వారు సేవ చేస్తున్నారని ఆ సేవలను గుర్తించి ప్రభుత్వాలు వారిని ఆదుకోవాలని వారన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలని ప్రజా సమస్యలని అటు ప్రభుత్వం దృష్టికి ఇటు ప్రజల దృష్టికి తీసుకు రావడంలో ప్రధానపాత్ర పోషిస్తున్నారని వారు అన్నారు. జర్నలిస్టులు ప్రజల కోసం ప్రజల సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేసే వ్యక్తులు వారికి ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇచ్చిన స్థలాలు ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీగా కోరుతున్నాం. మీరు చేసిన న్యాయమైన డిమాండ్ అని మద్దతు తెలియజేసి వారి ఏ కార్యక్రమం తీసుకున్న భాగస్వామ్యం అవుతామని వారు అన్నారు.ఈ కార్యక్రమానికి ఐ ఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ సంజీవ్,పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి ప్రణయ్ కుమార్ లు కూడా పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

# మావోయిస్టుల పై జరుగుతున్న వరస ఎన్ కౌంటర్లు ఖండిస్తున్నాం

*** సిపిఎం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర ప్రభుత్వం సహజ వనరుల దోపిడీ కోసమే మావోయిస్టుల పై ఎన్ కౌంటర్లు జరుపుతుందని, మావోయిస్టులపై జరుగుతున్న వరస ఎన్ కౌంటర్లు చేయడం ద్వారా సమాజంలో మార్పులు తీసుకురాలేరని సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఎన్ కౌంటర్లను తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటు అన్నారు, సమాజ మార్పు కి పాటు పడాల్సిన ప్రభుత్వం, వ్యక్తులను హత్య చేయడం ద్వారా ఉద్యమాలను ఆపుతామని భ్రమిస్తున్నారని అన్నారు, ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అడవిలో ఉన్న బొగ్గు ఇనుము ఇతర సహజ వనరుల దోపిడీకి అడ్డుగా ఉన్నారని ఆదివాసీలను అడవి నుంచి తొలగించడం కోసం ఈ చర్యలకు పాల్పడుతున్నారన్నారు, ఈ ఎన్కౌంటర్లు ప్రారంభమైన తర్వాతే చత్తీస్గడ్ అటవీ ప్రాంతంలో లక్షల చెట్లను దోపిడి దారులు నరికెశారన్నారు ,దేశవ్యాప్తంగా కార్మిక ,కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వస్తున్నటువంటి




అసంతృప్తిని దారి మళ్ళించడం కోసం ఈ చర్యలు చేపడుతున్నారన్నారు, అడవిని నమ్ముకుని బతుకుతున్న ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో అనేక చిత్ర హింసలకు గురిచేస్తూ బిజెపి ప్రభుత్వం దారుణమైన అకృత్యాలకు, హత్యలకు పాల్పడుతుందని ఆయన విమర్శించారు , ఆదివాసి ప్రాంతాల్లో ఆదివాసులకు భూములు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సినటువంటి ప్రభుత్వం వారిని పట్టించుకోకుండా, అడవి నుండి వారిని వెళ్లగొట్టే కుట్రలు చేస్తుందని అన్నారు, దేశవ్యాప్తంగానే బిజెపి ప్రభుత్వ విధానాల పట్ల వాస్తవాలు వెల్లడిస్తున్న సంస్థలు ,వ్యక్తులు జర్నలిస్టులపై, రచయితలపై హత్యాకాండ కొనసాగిస్తుందని విమర్శించారు,, బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ల దోపిడీ తీవ్రంగా పెరిగిందని ఆ దోపిడీ శక్తులకు అండగా ఉన్న బిజెపి చూపు ఇప్పుడు అడవిలో ఉండే సహజ వనరులపై పడిందన్నారు,దోపిడీ ఉన్నంతవరకు ప్రజలకు ఇబ్బందులు బాధలు ఉన్నంతవరకు విప్లవాలు వస్తూనే ఉంటాయని వ్యక్తులను హతమార్చినంత మాత్రాన విప్లవ ఉద్యమాలను ఆపలేరని ఆయన తెలిపారు, ఇప్పటికే కార్మికులు రైతులు, విద్యార్థులు ,యువకులు దేశంలో అనేక ఉద్యమాలను నిర్వహిస్తున్నారని అన్నారు,వెంటనే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మావోయిస్టుల హత్యాకాండను నిలిపివేయాలని సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

## మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు

*** మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్**

*** ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఎవరైనా మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ హెచ్చరించారు. ముస్తాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆమె బంధువు దొమకొండ గ్రామానికి చెందిన కుమ్మరి సత్యనారాయణపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మహిళలను ఎవరైనా వేధించిన, అసభ్యంగా ప్రవర్తించిన ఊరుకునేది లేదని, మహిళలు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు.

## సామాన్యులకు ఉపయోగం లేని బడ్జెట్

*** బిజెపి రాష్ట్ర నాయకులు నీరటి చంద్రమోహన్**



రాజపేట, ప్రజా స్ఫూర్తి : సామాన్యులకు ఉపయోగం లేని బడ్జెట్ గా ఉన్నదని బిజెపి రాష్ట్ర నాయకుడు నీరటి చంద్రమోహన్ అన్నారు. శనివారం రాజపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు 66 పథకాలు 420 హామీలతో కాలయాపన చేస్తున్నారని, అసెంబ్లీలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ అబద్దాల వర్షం కురిపించారనీ ప్రజలకు న్యాయం చేసేలాగా బడ్జెట్ లేదని నీరటి చంద్రమోహన్ అన్నారు. నిరుద్యోగ అభివృద్ధి చేస్తానని నిరుద్యోగులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, రైతులను కూడా నట్టేట్లో ముంచిన ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. మహిళలకు 2500 ఇస్తానని చెప్పి మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే అరిచేతి లో వైకుంఠం చూపించారన్నారు. కమ్యూనిస్టు పార్టీలు కాంగ్రెస్ పైన మొసలి కన్నీరు కారుస్తూ ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వగానే రైతులను మర్చిపోయిన ఘనత కమ్యూనిస్టు పార్టీదని విమర్శించారు. పదే పదే ఊకదంపుడు ఉపన్యాసలే గాని రైతులకు న్యాయం చేయలేని పార్టీలు ఇవేనా అని అన్నారు.

## కుత్బుల్లాపూర్ లో మెడికల్ కాలేజ్ పనులను సత్వరమే ప్రారంభించాలి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ లో మెడికల్ కాలేజ్ పనులను సత్వరమే ప్రారంభించాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాలలో భాగంగా శనివారం జరిగిన చర్చలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం 20 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని, దానికి సంబంధించి హెచ్ఎండిఏ పరిధిలో ఉండగా ఇప్పటికే జీవో కూడా విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ పనులను చేపట్టాలన్నారు.

## మందకృష్ణ మాదిగ పోరాట ఫలితం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం

*** అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మల్లేష్ మాదిగ, ఎంఆర్పిఎస్ మండల ఉపాధ్యక్షులు నాగరాజు మాదిగ**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఏళ్ల తరబడి చేసిన పోరాట ఫలితం ఎస్సీ వర్గీకరణ అని అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మల్లేష్ మాదిగ, ఎంఆర్పిఎస్ మండల ఉపాధ్యక్షులు నాగరాజు మాదిగ అన్నారు. రాష్ట్ర శాసన సభలో బిల్లుకు ఆమోదం తెలపడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర శాసన సభలో ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముస్తాబాద్ మండలంలోని తుర్కపల్లి గ్రామంలో సంబురాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేశారని, ఎంతో మంది త్యాగాలు, పోరాటం వల్ల ఎస్సీ వర్గీకరణ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, నాయకులు అంకని భాను మాదిగ, కాశోల్ల దుర్గాప్రసాద్ మాదిగ, ఎంఆర్పిఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు అశోక్ మాదిగ, నాయకులు ఎల్లం మాదిగ, బాలయ్య మాదిగ, రాజనర్సు మాదిగ, రంజిత్ మాదిగ, లింగం మాదిగ, చిన్న బాలయ్య మాదిగ, దేవదాస్ మాదిగ, నర్సింగం మాదిగ, శేఖర్ మాదిగ, ప్రవీణ్ మాదిగ, అర్జున్ మాదిగ, సుమన్ మాదిగ, కృషహరి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

*** ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కు మాజీ ఎమ్మెల్యే వినతి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : కొంపల్లి మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంపల్లి మున్సిపాలిటీలో పియంఆర్ ఎంక్లేవ్ నుండి పామ్ మీడోస్ వరకు , శాంతినగర్ కాలనీ వయ అపర్ణ పామ్ గ్రోవ్ సెప్టిక్ ట్యాంక్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మైకసా స్టెర్లింగ్ రోడ్ నుండి అవని గార్డెన్స్ రోడ్ వరకు , నోములస్ నిర్వన నుండి అపర్ణ పామ్ డ్రైనేజీ లైన్, జయాభేరి కాలనీలో ఓల్డ్ గోడౌన్ రోడ్ నుండి సెంట్రల్ పార్క్ వరకు డ్రైనేజీ లైన్ , సిసి రోడ్లు, ఊరచెరువు సుందరికరణ అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్ల నిధులు వెంటనే మంజూరు చెయ్యాలని కోరారు. దీంతో మంత్రి స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం

*** పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ బస్తి కాలనీలో రూ.35.00 లక్షల అంచనా వ్యయం తో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి పైప్ లైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ , జలమండలి అధికారులతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. మొగులమ్మ బస్తి కాలనీ లో శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు. అత్యవసరం ఉన్న చోట , నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామన్నారు. అన్నారు. ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝూన్సీ , నాయకులు, కార్యకర్తలు,కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బ్లూ కోల్ట్స్ , పెట్రోలింగ్ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో బ్లూ కోల్ట్స్ , పెట్రో కార్ విధులు నిర్వర్తించే సిబ్బందితో ఎస్పీ కార్యాలయం నుండి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి ప్రాంతంలో రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు.డయల్ 100 ఫోన్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేకూర్చటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఉన్నతాధికారుల సూచనలను పాటిస్తూ తమ విధులను క్రమశిక్షణతో నిర్వర్తించాలని తెలిపారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి సిఐ శ్రీనివాస్ , ఐటీ సెల్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ నాగరాజురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పని కోరు వారందరూ పనులకు హాజరు కావాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులకు పని కోరే ప్రతి ఒక్కరు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్న పనులన్నిటిని త్వరితగతిన పూర్తి చేయడానికి గాను, పని కొరకు చూసే ప్రతి కూలి హాజరుకావాలని కలెక్టర్ కోరారు. ఉపాధి హామీ పథకం పనికోరు వారందరూ 23032025 నుండి 29032025 వరకు వారం రోజులు వేగవంతంగా పనులు పూర్తి చేసేందుకు , ఆర్థిక సంవత్సరం ముగింపు ఉన్నందున పనులు పూర్తి చేసేందుకు పెద్ద ఎత్తున కూలీలు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపరచుకొని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించి ప్రతి వ్యవసాయ భూమిలో ఫామ్ పౌండ్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. బోర్ ద్వారా వ్యవసాయం చేసే ప్రతి రైతు వ్యవసాయ భూమిలో కచ్చితంగా నీటి గుంటల నిర్మాణం చేపట్టాల్సిందే అని కలెక్టర్ స్పష్టం చేశారు.

## మోత్కుపల్లి బాలకృష్ణను పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ఇటీవల ప్రమాదానికి గురై హైదరాబాద్ లోని మెడిసిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టిఆర్ఎస్వి యువ నాయకుడు మోత్కూపల్లి బాలకృష్ణ ను మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ కి సూచించారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకులు తుంగ బాలు, మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, సందిల భాస్కర్ గౌడ్, పల్లె సంతోష్ గౌడ్, మన్నె ప్రభాకర్ వరిమడ్ల బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

# దిల్లీ బడ్జెట్.. 10 వేల సూచనలు అందాయి: సీఎం రేఖాగుప్తా

త్వరలో ప్రవేశపెట్టనున్న వికసిత్ దిల్లీ బడ్జెట్ విషయంలో ప్రజల నుంచి 10 వేల సూచనలు అందినట్లు ముఖ్యమంత్రి రేఖాగుప్తా వెల్లడించారు. ఇందులో మహిళల ఆర్థిక సాధికారత, విద్య, ఆరోగ్యం, యమునా నది ప్రక్షాళన, కాలుష్యం వంటివాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె ప్రకటించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం 'ఖీర్' వేడుకతో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. దేశరాజధానిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 24 నుంచి 28 వరకు జరగనున్నాయి. మార్చి 25న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.



బడ్జెట్‌ను సిద్ధం చేసే ముందు ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు తమ ప్రభుత్వం నిపుణులతో సహా సమాజంలోని వివిధ వర్గాలను సంప్రదించిందని రేఖా గుప్త తెలిపారు. ప్రజల నుంచి మెయిల్ ద్వారా 3,303 సూచనలు రాగా.. వాట్సప్ ద్వారా 6,982 సూచనలు వచ్చినట్లు వెల్లడించారు. వాటిని పరిగణలోకి తీసుకొని బడ్జెట్‌ను రూపొందిస్తామని అన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను, ఉపాధి కల్పనను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం దిల్లీని అభివృద్ధి బాటలో నడుపుతుందని పేర్కొన్నారు.

## హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు



దిల్లీ: ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 2024 ఏడాదికి సంబంధించి జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ శనివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న మొదటి రచయిత శుక్లానే కావడం విశేషం. భారతీయ సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 'జ్ఞానపీఠ్ అవార్డు'ను అందజేస్తారు. 1944లో ఏర్పాటైన ఈ పురస్కారాన్ని.. దేశంలోనే అత్యున్నత సాహిత్య గౌరవంగా పరిగణిస్తారు. శుక్లా ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయిత. ఈ పురస్కారం కింద రూ.11 లక్షల నగదు, సరస్వతి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు. హిందీ సాహిత్యం, విలక్షణమైన రచనా శైలికి ఆయన చేసిన అద్భుతమైన కృషికిగానూ ఈ అవార్డు వరించింది. 1999లో ఆయన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఇక గత ఏడాది ఉర్దూ కవి, సినీ గేయరచయిత గుల్జార్, సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య ఈ పురస్కారాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.

## నాగ్‌పూర్ హింస వెనుక బంగ్లా హస్తం..! ఫడణవీస్ ఏమన్నారంటే?

మహారాష్ట్రలో నాగ్‌పుర్‌లో మార్చి 17న రెండు వర్గాల మధ్య చెలరేగిన హింసతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ అల్లర్లలో బంగ్లాదేశీయుల హస్తం ఉందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. ప్రస్తుతం దీనిపై ఏమీ చెప్పలేమని.. దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దీని వెనుక ఉన్నది ఎవరైనా కఠిన చర్యలు తప్పవని అన్నారు. నాగ్‌పుర్‌లో నెలకొన్న హింసకు సంబంధించిన కారణాలపై మహారాష్ట్ర భాజపా అధ్యక్షుడు చంద్రశేఖర్ సమక్షంలో పోలీసు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. హింసకు కారణమైన వారినుంచే ఆస్తి నష్టం మొత్తాన్ని వసూలు చేస్తామని ఫడణవీస్ పేర్కొన్నారు. వారు డబ్బు చెల్లించని పక్షంలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని విక్రయిస్తామని అన్నారు. ''మతపరమైన వస్తువులు దహనం చేసినట్లు కొంతమంది సోషల్ మీడియా వేదికగా తప్పుడు పుకార్లు



వ్యాప్తి చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి కారణమైన 104 మందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వదంతులు వ్యాప్తి చేసి..అల్లర్లకు కారణమైన వారిని కూడా నిందితులుగా పరిగణిస్తాం. ఇప్పటి వరకు 66 పోస్ట్‌లను తొలగించాము'' అని ఫడణవీస్ అన్నారు. మార్చి 17న నాగ్‌పుర్‌లో కొందరు మతపరమైన వ్యాఖ్యలు చేయడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. అనంతరం కొందరు ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టేలా నినాదాలు చేయడంతో హింసాత్మకంగా మారింది. ఘర్షణలో 34 మంది పోలీసులు గాయపడ్డారని, ఇందులో ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు ఉన్నారని అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ అల్లర్ల వెనుక బంగ్లాదేశీయుల హస్తం ఉండి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



## ఆన్‌లైన్ మనీ గేమింగ్ వెబ్‌సైట్‌లపై డీజీజీఐ కొరడా

ఆన్‌లైన్ మనీ గేమింగ్ సంస్థలపై కేంద్రం కొరడా ఝుళిపించింది. అక్రమంగా నిర్వహిస్తోన్న 357 వెబ్‌సైట్లను ఆర్థిక శాఖ పరిధిలోని డీజీజీఐ బ్లాక్ చేసింది. ఆ గేమింగ్ సంస్థలకు చెందిన 2400 బ్యాంక్ ఖాతాలు సీజ్ చేసి, రూ.126 కోట్లను ఫ్రీజ్ చేసింది. అలాగే మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల పట్ల అప్రమత్తం ఉండాలని, వాటిని ఎవరూ వాడొద్దని డీజీజీఐ హెచ్చరించింది. ''సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాలను దాచిపెడుతూ జీఎస్టీ ఎగవేతలకు పాల్పడుతోన్న చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై చర్యలు తీసుకున్నాం. ఐటీశాఖ సమన్వయంతో 357 వెబ్‌సైట్‌లను బ్లాక్ చేశాం'' అని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. వీటితో పాటు బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు పాల్పడుతోన్న సుమారు 700 సంస్థలపై నిఘా ఉంచింది. దేశం వెలుపల ఈ తరహా సంస్థలు నడుపుతోన్న పలువురు భారతీయులపై డీజీజీఐ మరో ఆపరేషన్ చేపట్టింది. వారికి చెందిన 166 ఖాతాలను బ్లాక్ చేసింది. అలాగే ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. ''సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో పాటు బాలీవుడ్ సెలబ్రిటీలు, క్రికెటర్లు ఈ సంస్థల ప్రచారంలో పాల్గొంటున్నారని గుర్తించాం. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. వాటికి దూరంగా ఉండాలి. ఆ ప్లాట్‌ఫామ్‌లు వ్యక్తుల ఆర్థిక భద్రతను దెబ్బతీయవచ్చు. దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయి'' అని ఆర్థిక శాఖ హెచ్చరించింది

## నారాయణమూర్తి 70 గంటల పని వ్యాఖ్యలపై స్పందించిన సుధామూర్తి

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఇటీవల పని గంటలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ఆయన భార్య, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి స్పందించారు. ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే సమయం ఎప్పుడూ పరిమితంగా మారదని ఆమె వ్యాఖ్యానించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. 'ప్రజలు ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే దానికి సమయం ఎప్పుడు పరిమితిగా మారదు. నా భర్త డబ్బులు లేని సమయంలో కూడా ఇన్ఫోసిస్‌ను నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు అంకితభావం కలిగిన వ్యక్తులతో కలిసి 70 గంటలు అంతకంటే ఎక్కువ సమయం పని చేయడం వల్లే అది సాధ్యమైంది. నా భర్త మాత్రమే కాదు.. జర్నలిస్టులు, డాక్టర్లు వంటి ఇతర రంగాల్లోని వారు కూడా 90 గంటలు



పని చేస్తున్నారు. భగవంతుడు అందరికీ రోజుకి 24 గంటల సమయమే ఇచ్చాడు. దానిని మీరు ఎలా వినియోగించుకుంటారు అనేది మీ ఇష్టం' అని సుధామూర్తి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె వ్యక్తి గత జీవితం గురించి కూడా మాట్లాడారు. నారాయణమూర్తి ఇన్ఫోసిస్‌ను చూసుకున్నప్పుడు తాను ఇంటి బాధ్యతలు తీసుకున్నానని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తాను ఇంటిని చూసుకోవడం, పిల్లలను పెంచడంతో పాటు కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను తన భర్త కంటే ఓవర్‌టైమ్ పని చేస్తున్నానని, దానికి ఆయన వెనక నుంచి సపోర్ట్‌గా ఉండి ముందుకు నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి మహిళ విజయం వెనక అర్థం చేసుకునే వ్యక్తి ఉంటారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా వృత్తి జీవితంలో భార్యాభర్తలు ఒకరికొకరు సాయం చేసుకోవాలని అదే జీవితమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కొందరు దీన్ని సమర్థించగా.. మరికొందరు వ్యతిరేకించారు. వారానికి 90 గంటల పాటు పనిచేయాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలూ నెట్టింట చర్చకు దారితీశాయి.

## రెండేళ్ల ఆలస్యం తర్వాత.. తేజస్‌కు అమెరికా ఇంజిన్లు

టారిఫ్ ఆందోళనల వేళ.. భారత్‌అమెరికా మధ్య రక్షణ రంగ సహకారానికి సంబంధించి కీలక పురోగతి కనిపించింది. తేజస్ యుద్ధ విమానాల తయారీలో ముఖ్యమైన F404 ఇంజిన్లు అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ ఏరోస్పేస్(GE) నుంచి డెలివరీ కానున్నాయి. రెండేళ్ల ఆలస్యం తర్వాత అవి ఈనెల భారత్‌కు రానున్నాయి. ఈ ఏడాది మొత్తం 12 ఇంజిన్లు అందనున్నాయి. తేజస్ మార్క్ 1A యుద్ధ విమానాల్లో F404 ఇంజిన్లు అత్యంత కీలకం. అయితే డెలివరీ జాప్యంతో హాల్ (హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్)లో తేజస్ యుద్ధ విమానాల తయారీ ప్రక్రియ నెమ్మదించింది. పాకిస్థాన్, చైనా నుంచి పొంచి ఉన్న ముప్పు, అలాగే డ్రాగన్ అత్యాధునిక ఫైటర్ జెట్లను రూపొందించి పాక్‌కు అందిస్తుంటే.. మనం ఇంజిన్ల కోసం వేచిచూడాల్సి రావడం ఆందోళనకు దారితీసింది. 2021లో కుదిరిన 761 మిలియన్ల డాలర్ల కాంట్రాక్ట్ ప్రకారం.. ఏటా 20 ఇంజిన్లు అందుతాయని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలాఉంటే.. 98 కేఎన్ థ్రస్ట్ (కిలోన్యూటన్ల శక్తి) కలిగిన F414 ఇంజిన్‌నూ అమెరికా నుంచి సమకూర్చుకోవాలని భారత్ తలపెట్టింది. మార్క్ 2లో వాటిని అమర్చాలని యోచిస్తున్నారు. అయితే వీటి సరఫరా కూడా ఇంకా మొదలుకాలేదు. ఇదిలాఉంటే.. ప్రస్తుతం ప్రపంచంలో సొంతంగా ఫైటర్ ఇంజిన్‌ను తయారుచేసే సత్తా అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనాలకే ఉంది. ఆ సామర్థ్యాన్ని సాధించేందుకు భారత్ 1984లోనే కావేరి ఇంజిన్ ప్రాజెక్టు చేపట్టింది.



అణ్వస్త్ర పరీక్షల వల్ల అంతర్జాతీయ ఆంక్షలకు గురవడంతో ఈ ప్రాజెక్టు దెబ్బతింది. అయితే, 2016లో ఫ్రెంచి కంపెనీ శాఫ్రాన్ సహకారంతో 110 కేఎన్ శక్తి గల ఇంజిన్‌ను తయారీని తలపెట్టింది.



# డెన్మార్క్ రాణి 1800ల నాటి అరుదైన కిరీటం..! 140 ఏళ్లుగా..

రాణులు ధరించే ప్రతి ఆభరణానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంటుంది. తరతరాలుగా ఆ ఆభరణాలను వారసత్వంగా ధరించడం జరుగుతుంది. అయితే ఆ భరణాలు అత్యంత ఖరీదే గాక వాటి వెనుక ఎంతో ఆసక్తికరమైన కథలు ఉంటాయి. వాటి నేపథ్యం చూస్తే నోటమాటరాదు. అన్నేళ్లుగా ఆ ఆభరణాలను తరతరాలుగా భద్రపరచడం చూస్తే..వాటికున్న విలువ, పూర్వకాలం నాటి హస్తకళా నైపుణ్యం భవిష్యత్తు తరాలకు తెలుసుకునే వీలుంటుంది. ప్రస్తుతం ఈ డెన్మార్క్ క్వీన్ ధరించి శిరోభూషణం కూడా అందరి దృష్టిని ఆకర్షించడమే ఒక్కసారిగా దాని చారిత్రక నేపథ్యం కళ్లముందుకు కదలాడింది. మరీ ఆఇంట్రస్టింగ్ స్టోరీ ఏంటో చూద్దామా..!.

డెన్మార్క్‌రాణి మేరీ ఇటీవల హెల్సింకిలోని ఒక రాష్ట్ర వేడకలో అందరూ మర్చిపోయిన రాజ ఆభరణాన్ని వెలుగులోకి తెచ్చింది. క్వీన్ మేరీ డెన్మార్క్, ఫిన్లాండ్‌ల మధ్య సన్నిహిత సంబంధాల బలోపేతం చేసుకునేందకు ఏర్పాటు చేసిన వైట్- టై ఈవెంట్‌లో ఈ శిరో ఆభరణాన్ని(కిరీటం)ధరించింది.

ఆమె ధరించి కిరీటం 1839- 1848 కాలం నాటిది. ఆ కాలంలో డెన్మార్క్ రాజప్రతినిధి అయిన క్రిస్టియన్ VIIIని వివాహం చేసుకున్న క్వీన్ కరోలిన అమాలీకి చెందిన బంగారు కీరిటీం. ఈ కిరీటం అత్యంత అరుదైన రత్నాలతో పొదిగి ఉంటుంది. డానిష్ కోర్టు ప్రకారం, 1819-1821లో ఈ జంట ఇటలీ పర్యటన సందర్భంగా ఆ 11 రత్నాలను సేకరించారట. ఆ పర్యటనలో ఈ దంపతులు రోమ్‌ని సందర్శించి సమీపంలో పాంపీలో జరిపిన పురాతన తవ్వకాల నుంచి వీటిని సేకరించినట్లు డానిష్ కోర్టు పేర్కొంది.

### ఆసక్తికర కథేంటంటే..

ఈ కిరీటం 140 ఏళ్లకు పైగా కనిపించలేదు. రాజ ఖజనాలోనే లాక్ చేసి ఉంచారని డానిష్ కోర్టు ధృవీకరించింది. మళ్లీ ఇన్నేళ్లకు డెన్మార్క్ రాణి మేరీ ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో జరిగిన వేడుకలో ఆ ఆభరణాన్ని తలకు ధరించింది. ఈ కార్యక్రమం ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, అతని భార్య సుజాన్ ఇన్నెస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

ఇది ఇరు దేశాల సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా జరిగిన ఈవెంట్. ఇక రాయల్ కలెక్షన్లలో తరుచుగా కనిపించే అత్యంత విలాసవంతమైన వస్తువులా కాకుండా రోజువారీ దుస్తులకు సరిపోయేలా ధరించడానికి అనుగుణంగా ఉండేటమే ఈ కిరీటం ప్రత్యేకతట.





# సుమనోహరం వెడ్డింగ్ ట్రెండ్స్..! నవ వధువు హైలెట్‌గా కనిపించేలా..!

పెళ్లిళ్ల సీజన్‌కు ముందు బుక్ మార్క్ చేసుకోదగిన అతిపెద్ద ఫ్యాషన్ ట్రెండ్స్ ఈ ఏడాది మనల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయం, ఆధునిక ధోరణులను కలబోసి మన ముందుకు తీసుకువచ్చాయి. వధువుల కోర్సెట్ చోళీలు, భారతీయ సంప్రదాయ నేత చీరలు, పలుచటి మేలి ముసుగులు, ఆకర్షణీయమైన ఎంబ్రాయిడరీ ప్రత్యేకంగా కనిపించాయి. పెళ్ళిళ్లకు ముందే బుక్ మార్క్ చేసుకోదగిన పెళ్లికూతురుట్రెండ్స్‌లో ప్రధానంగా కనిపించిన జాబితాను చెక్ చేద్దాం..

### భారతీయ చేనేత

క్లాసిక్ ఇండియన్ చేనేత పునరుజ్జీవనాన్ని మనం గమనించి తీరాలి. వివాహ వేడుకలకు కాంజీవరం, బనారసి, చికంకారి వంటి చీరలకు మంచి డిమాండ్ ఉంది. ఈ కాలాతీత డిజైన్లు సంప్రదాయ రూపంలో ధరించినా లేదా ఆధునిక ట్విస్ట్‌తో మెరిపించినా, ఇవి మసకబారే సూచనలు కనిపించడం లేదన్నది నిజం. కోర్సెట్‌లు ఫ్యాషన్ రంగాన్ని ఆక్రమించాయి అని చెప్పవచ్చు. వీటిని సంప్రదాయ వివాహ వేడుకలకు తీసుకురావడం ఎలా అనే అంశంపై పెద్ద కసరత్తే జరిగింది. అందుకు పెళ్లికూతుళ్లు కూడా తమ వివాహ సమయంలో ఆధునికంగా కనిపించడానికి కోర్సెట్ చోళీలను ఎంచుకుంటున్నారు. దాంతో దిగ్గజ డిజైనర్లు తమ డిజైన్స్‌కు ఆధునికతను జోడిస్తున్నారు. సాంప్రదాయ పెళ్లి బ్లౌజ్‌లకు ఇవి ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నాయి. ఫిష్‌టైల్ లెహంగాతో కోర్సెట్ చోళీలు జతగా చేరి అద్భుతంగా కనిపిస్తున్నాయి. సంగీత్ నుంచి రిసెప్షన్ వరకు కోర్సెట్‌లు అంతటా రాజ్యమేలుతున్నాయి.

### లాంగ్ వెయిల్స్

పాశ్చాత్య వివాహాల నుంచి వీటిని స్ఫూర్తి పొందినట్లు అనిపిస్తుంది. కానీ ప్రస్తుతం వధువులలో ట్రైల్ లేదా వెయిల్ ఉన్న లెహంగాలను ధరించే ధోరణి పెరుగుతోంది. గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలనుకునే వధువులకు ఈ లుక్ ఒక గొప్ప ఎంపిక. లాంగ్ ట్రైల్స్ లేదా వెయిల్స్ ఉన్న లెహంగాలు ప్రిన్సెస్ లుక్‌తో అందంగా కనిపిస్తాయి.





# ఆ పెర్ఫ్యూమ్ ప్రతి గంటకు 108 బాటిళ్లు సేల్ అవుతాయ్..!

## తయారీ వెనుకున్న ఇంట్రస్టింగ్ స్టోరీ ఇదే..

*పెర్ఫ్యూమ్‌ల తయారీలు చూస్తే చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఆహ్లాదభరితమైన వాటి సువాసనే దాని తయారీ వెనుకున్న కృషిని కళ్లకు కట్టేలా చూపిస్తుంది. అయితే ఈ పెర్ఫ్యూమ్ మాత్రం ఎన్ని కొత్త బ్రాండెడ్ పెర్ఫ్యూమ్‌లు వచ్చినప్పటికీ..దాని క్రేజ్‌కి సాటిలేదు ఏదీ..!. ఇప్పటికీ విక్రయాల పరంగా ఎవర్ గ్రీన్ ఇదే. గంటకు వందలకొద్దీ బాటిళ్లు సేల్ అయిపోతాయట. అంతలా ప్రజాదరణ పొందిన ఈ పెర్ఫ్యూమ్ తయారీ వెనుకున్న గమ్మత్తైన స్టోరీ చూస్తే.."ప్రేమ" గొప్ప ఆవిష్కరణాలకు దారితీస్తుందా..! అనిపిస్తుంది. మరీ ఆ పెర్ఫ్యూమ్ సృష్టికర్త..దాని తయారీకి ప్రేరేపించిన లవ్‌స్టోరీ వంటి వాటి గురించి తెలుసుకుందామా..!.*



ఆ పెర్ఫ్యూమ్ సృష్టికర్త ఫ్రెంచ్ పెర్ఫ్యూమర్ జాక్వెస్ గెర్లైన్. 1924లో దాన్ని తయారు చేశాడు. సువాసన పరిశ్రమలో ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడయ్యే రెండవ పెర్ఫ్యూమ్‌గా ఇది నిలిచింది. ఇప్పటికీ దాని అమ్మకాలు రికార్డు స్థాయిలోనే ఉంటాయట. ఎన్నెన్ని కొంగొత్త బ్రాండ్‌లు కూడా దానిముందు నిలవజాలవని అంటారు మార్కెట్ నిపుణులు. జాక్వెస్‌ని ఈ పెర్ఫ్యూమ్‌ని తయారు చేసేలా ప్రేరేపించింది మొఘల్ చక్రవర్తి షాజహాన్ ప్రేమ కథ అట. పారిస్ మహారాజుని సందర్శించినప్పుడే జాక్వెస్‌కి షాజహాన్ లవ్‌స్టోరీ గురించి తెలిసిందట. మొఘల్ చక్రవర్తి షాజహాన్‌కి తన భార్య ముంతాజ్ మహల్ అంటే ఎంత ఇష్టమో తెలుసుకున్నాడట. ఆమె కోసమే షాలిమార్ గార్డెన్స్‌ని సృష్టించాడట. ఇక్కడ షాలిమార్ అంటే అత్యంత సువాసనా భరితమైన ఉద్యానవనం అని అర్థం. ఆఖరికి ఆమె తన నుంచి దూర మైపోయిందని, ముంతాజ్ జ్ఞాపకార్థం తాజ్ మహల్‌ని కట్టించాడని తెలుసుకుని చలించిపోయాడట. షాజహాన్ ప్రేమ ఆ ఫ్రెంచ్ ఫెర్ఫ్యూమర్ మనసును ఎంతగానో కదిలించిందట. అంతటి చక్రవర్తి గొప్ప ప్రేమను పొందిన మహా రాజ్ఞీ ముంతాజ్ గౌరవార్థం అత్యంత సువానభరితమైన సెంట్‌ని తయారుచేయాలని ఆ క్షణమే గట్టిగా నిశ్చయించుకున్నాడట. అలా జాక్వెస్ పరిపూర్ణమైన సువాసన కోసం వెల్వెట్ వెనిల్లా, గంధం,రెసిన్ బెంజోయిన్, ఐరిస్, ప్యాచౌలి, ధూపం వంటి కలయికతో మనసును కట్టిపడేసే అద్భుతమైన పెర్ఫ్యూమ్‌ని తయారు చేశాడు. అయితే దాని బాటిల్ డిజైన్ కూడా అంతే అద్భుతంగా ఉండాలని భావించి అసాధారణమైన డిజైన్‌ని ఎంపిక చేసుకున్నాడు. నీలిరంగు, ఫ్యాన్ ఆకారపు బాటిల్‌తో ఈ పెర్ఫ్యూమ్‌నీ తీసుకొచ్చాడు. ఈ బాటిల్‌ని బాకరట్ క్రిస్టల్‌తో తయారు చేశారట. అంతేగాదు ఈ పెర్ఫ్యూమ్ బాటిల్ డిజైన్ 1925లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ అలంకార కళల ప్రదర్శన అవార్డు(ఇంటర్నేషనల్ డెకరేషన్ అవార్డు)ని గెలుచుకుంది. ఈ రోజు వరకు కూడా ఈ ఫెర్ఫ్యూమ్ విక్రయాలు పెరుగుతూనే ఉన్నాయట. ప్రపంచవ్యాప్తంగా ప్రతి గంటకు 108 బాటిళ్లు అమ్ముడయ్యే పెర్ఫ్యూమ్‌గా రికార్డులకెక్కింది.

### ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్స్‌పై కేంద్రం కొరడా..

## 357 వెబ్‌సైట్స్ బ్లాక్..!



**న్యూఢిల్లీ:** ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా ఝుళిపించింది. జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు అక్రమ ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల 357 వెబ్‌సైట్‌లను బ్లాక్ చేశారని.. దాదాపు 2,400 బ్యాంక్ ఖాతాలను అటాచ్ చేసినట్లుగా ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. రూ.126 కోట్లను ఫ్రీజ్ చేసినట్లు పేర్కొంది. మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని.. వాటిని ఎవరూ వినియోగించొద్దని డీజీజీఐ సూచించింది. కొన్ని సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాన్ని దాచిపెడుతూ జీఎస్టీ ఎగవేతలకు పాల్పడుతున్న చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై చర్యలు తీసుకున్నామని.. 357 వైబ్‌సైట్స్‌ని ఐటీశాఖ సమన్వయంతో బ్లాక్ చేసినట్లు మంత్రిత్వశాఖ పేర్కొంది. బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు పాల్పడుతోన్న సుమారు 700 సంస్థలపై నిఘా వేసినట్లు పేర్కొంది. దేశం వెలుపల ఈ తరహా సంస్థలు నడుపుతోన్న పలువురు భారతీయులపై డీజీజీఐ మరో ఆపరేషన్ చేపట్టి.. వారికి సంబంధించిన 166 ఖాతాలను బ్లాక్ చేసింది. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నది. చాలామంది బాలీవుడ్ ప్రముఖులు, క్రికెటర్లు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఈ ప్లాట్‌ఫామ్స్‌కు ప్రచారం నిర్వహిస్తున్నట్లుగా గుర్తించినట్లు పేర్కొంది. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఆ ప్లాట్‌ఫామ్స్ వ్యక్తుల ఆర్థిక భద్రతను దెబ్బతీసే అవకాశం ఉందని.. దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. జీఎస్టీ చట్టం ప్రకారం.. ఆన్‌లైన్ గేమింగ్‌కు 28శాతం జీఎస్టీ విధిస్తున్నారు. ఈ రంగంలో పని చేస్తున్న సంస్థలు జీఎస్టీ కింద రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. రాబోయే ఐపీఎల్ సీజన్‌తో సహా చట్టవిరుద్ధమైన గేమింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు ఉంటాయని పేర్కొంది.

## ఈవీ బీమాకు భారీగా డిమాండ్..

### మూడేళ్లలో 16 రెట్లు పెరుగుదల..!




**న్యూఢిల్లీ:** ఎలక్ట్రికల్ వాహనాల బీమాకు డిమాండ్ పెరుగుతున్నది. పాలసీ బజార్ ఇంటర్నల్ డేటా ప్రకారం.. గత మూడేళ్లలో ఈవీ బీమా డిమాండ్ 16 రెట్లు పెరిగింది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈవీ కార్ల బీమా వాటా కేవలం 0.50శాతం మాత్రమే ఉండగా.. మార్చి 2025 నాటికి 14శాతానికి పెరిగిందని ప్రైవేటు రంగ బీమా కంపెనీ ఓ నివేదికలో తెలిపింది. ఈ సందర్భంగా పాలసీ బజార్ ఇన్సూరెన్స్ సీబీవో అమిత్ ఛబ్రా మాట్లాడుతూ ఈవీ బీమా డిమాండ్.. సస్టెయినబుల్ మొబిలిటీ వైపు భారత్ పయనిస్తుందనేదానికి సంకేతమని పేర్కొన్నారు.

ఈవీ బీమా వాటా గత మూడేళ్లలో 16 రెట్లు పెరిగిందని తెలిపారు. ఇది ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయడమే కాకుండా అవసరమైన భద్రతా చర్యలను తీసుకుంటున్నట్లుగా అర్థమని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో విక్రయించిన మొత్తం ద్విచక్ర వాహనాల బీమా పాలసీల్లో 7-8శాతం ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలకు చేయబడిందని చెప్పారు. గతేడాది కాలంలో ఈ సంఖ్య రెట్టింపు కావడం విశేషం. గతేడాది 10వేల ఈవీ ద్విచక్ర వాహనాలకు బీమా చేయగా.. ఈ ఏడాది ఈ సంఖ్య 20వేలకు చేరింది. ద్విచక్ర వాహనాల విభాగంలో ఎలక్ట్రిక్ స్కూటర్లదే అత్యధిక వాటా కాగా.. బీమా చేసిన ద్విచక్ర వాహనాల్లో ఈవీ 98-99శాతం ఉన్నాయి.

దేశంలోని ఐదు బడా మెట్రో నగరాలైన ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, పూణే, చెన్నై, ముంబయి-థానేలో ఈవీ బీమాకు భారీ డిమాండ్ ఉన్నది. ఆయా నగరాల్లో మొత్తం 55శాతం ఈవీ బీమా పాలసీలను వాహనదారులు కొనుగోలు చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ 18.3 శాతం మార్కెట్ వాటాతో ముందంజలో నిలిచింది. బెంగళూరు 16 శాతం వాటాతో రెండో స్థానంలో నిలిచింది. పుణె (7.6శాతం), చెన్నై (6.7శాతం), ముంబయి-థానే (6.4శాతం) డిమాండ్ ఉన్నది. డేటా ప్రకారం.. ఈవీ బీమాలో 58శాతం టైర్-1 నగరాల నుంచి రాగా.. టైర్-2 నుంచి 30శాతం, టైర్-3 నగరాల వాటా 12శాతంగా ఉన్నది.

## వేలానికి ట్విట్టర్ పాత లోగో..

### భారీ ధర పలికిన బ్లూ పిట్ట



**న్యూఢిల్లీ:** ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విటర్ (ప్రస్తుతం ఎక్స్)కు చెందిన ఐకానిక్ లోగో బ్లూకలర్‌లో ఉండే బుల్లి పిట్ట గుర్తుందా..? ఒకప్పుడు ట్విట్టర్ పేరు వినగానే అందరికీ ముందుగా ఈ పిట్ట బొమ్మే గుర్తొచ్చేది. నీలిరంగులో ఉండే ఆ పిట్ట బొమ్మ ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు సదరు పాత ట్విట్టర్ లోగో బ్లూ బర్డ్‌ను వేలం వేశారు. ఈ వేలంలో ట్విట్టర్ పిట్ట భారీ ధర పలికింది.

ఆర్ఆర్ ఆక్షన్ అనే సంస్థ నిర్వహించిన తాజా వేలంపాటలో పిట్ట లోగో 35 వేల డాలర్లకు అమ్ముడైంది. అంటే భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.30 లక్షలన్నమాట. వేలంలో దీనిని దక్కించుకున్న వ్యక్తి వివరాలను ఆక్షన్ సంస్థ వెల్లడించలేదు. అమెరికా శాన్‌ఫ్రాన్సిస్కోలోని ట్విట్టర్ హెడ్‌క్వార్టర్ బిల్డింగ్ గోడపై ఇంతకాలం దర్శనమిచ్చిన బ్లూ బర్డ్ లోగో పన్నెండు అడుగుల పొడవు, తొమ్మిది అడుగుల వెడల్పు, 254 కిలోల బరువు ఉండేది.

2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్ల చొప్పున 44 బిలియన్ డాలర్లు చెల్లించారు. ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత మస్క్ అనేక మార్పులు చేపట్టారు. సంస్థ పేరును ట్విటర్ నుంచి 'ఎక్స్'గా మార్చారు. అదేవిధంగా ట్విట్టర్ పిట్ట స్థానంలోకి 'ఎక్స్'ను చేర్చారు. దాదాపు 75 శాతం మంది ఉద్యోగులను తొలగించారు. కంటెంట్ విషయంలోనూ అనేక మార్పులు తీసుకొచ్చారు. ఇప్పుడు.. ఒకప్పటి ట్విట్టర్ విలువైన పాత జ్ఞాపకమైన ఐకానిక్ బ్లూబర్డ్ లోగోను అమ్మేశారు.

2006లో ఏర్పాటైన ట్విట్టర్ లోగోగా పక్షుల కిలకిలరావాలకు గుర్తుగా 'బర్డ్' లోగో ఏర్పాటు చేశారు. వెబ్ సైట్ క్రియేటివ్ బ్లాగ్ కథనం ప్రకారం లైట్ బ్లూ బర్డ్ సింబల్ కోసం అప్పట్లో 15 డాలర్లు చెల్లించి లోగో తయారు చేయించారు.

# కోహ్లీ సూపర్ షో..

**ఐపీఎల్ 2025లో తొలి విజయం ఆర్సీబీదే**
**ఐపీఎల్ 2025కు అదిరే ఆరంభం**
**విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీ**



**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతాను 7 వికెట్ల తేడాతో ఓడించి.. ఐపీఎల్ 2025ని ఘనంగా ఆరంభించింది. ఈ మ్యాచ్‌లో కేకేఆర్ 174/8 పరుగులు చేయగా.. ఆర్సీబీ.. 16.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీతో నాటౌట్‌గా నిలిచాడు. ఫిలిప్ సాల్ట్ చక్కని సహకారం అందించాడు.**

**కోల్‌కతా:** ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బోణీ కొట్టింది. శనివారం జరిగిన టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును దాని సొంతగడ్డపై ఓడించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి.. పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. 18వ ఎడిషన్‌లో తొలి విజయం సాధించిన జట్టుగా ఆర్సీబీ నిలిచింది. కేకేఆర్ నిర్దేశించిన 175 పరుగుల లక్ష్యాన్ని మరో 22 బంతులు ఉండగానే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది.



ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటీదార్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే ఓపెనర్ క్వింటన్ డికాక్ (4) వికెట్ త్వరగానే కోల్పోయినా.. కేకేఆర్ మాత్రం ఓ దశలో 9.5 ఓవర్లలో 107/1తో నిలిచింది. ఓపెనర్ సునీల్ నరైన్ 26 బంతుల్లో 44 రన్స్, అజింక్య రహానే 31 బంతుల్లో 56 పరుగులు చేయడంతో కోల్‌కతా భారీ స్కోరుపై కన్నేసింది. కానీ పుంజుకున్న ఆర్సబీ బౌలర్లు.. వరుసగా వికెట్లు పడగొట్టారు. దీంతో ఆ జట్టు అనుకున్నదానికంటే తక్కువ స్కోరుకే పరిమితమైంది. నిర్ణీత 20 ఓవర్లలో కేకేఆర్.. 174/8 పరుగులు చేసింది.

ఆర్సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్యా అత్యధికంగా 3 వికెట్లు తీశాడు. జోష్ హేజిల్‌వుడ్ 2, యశ్ దయాళ్, రసిక్ దార్ సలామ్, సుయాశ్ శర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆర్సీబీకి.. ఓపెనర్లు అదిరే ఆరంభం ఇచ్చారు. విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్‌లు 51 బంతుల్లోనే 95 పరుగులు జోడించి.. జట్టు విజయానికి బాటలు వేశారు. 31 బంతుల్లో 56 రన్స్ చేసిన తర్వాత ఫిలిప్ సాల్ట్ ఔట్ అయినా.. కోహ్లీ మాత్రం చివరి వరకూ క్రీజులో ఉన్నాడు. మధ్యలో రజత్ పాటీదార్ (16 బంతుల్లో 34 రన్స్) బ్యాట్ ఝుళిపించాడు. చివరకు ఆర్సీబీ.. 16.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. టోర్నీలో తొలి విజయాన్ని నమోదు చేసింది. విరాట్ కోహ్లీ 36 బంతుల్లో 59 రన్స్ చేసి నాటౌట్‌గా ఉన్నాడు. ఈ విజయంతో రెండు పాయింట్లతో పాటు.. భారీగా నెట్‌రన్‌రేట్‌ను కూడా ఆర్సీబీ తన ఖాతాలో వేసుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన కేకేఆర్.. హోంగ్రౌండ్‌లో చిత్తుగా ఓడిపోయింది.

## బాక్సింగ్ దిగ్గజం కన్నుమూత

### పంచ్ విసిరితే నాకౌటే..!

**న్యూయార్క్:** బాక్సింగ్ రింగ్‌లో ఎదురులేని మొనగాడు.. రెండు సార్లు వరల్డ్ హెవీ వెయిట్ బాక్సింగ్ ఛాంపియన్ జార్జ్ ఫొరెమాన్ కన్నుమూశాడు. అమెరికాకు చెందిన ఆయన 76 ఏళ్ల వయసులో తుది శ్వాస విడిచాడు. శుక్రవారం ఈ బాక్సింగ్ దిగ్గజం మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. అయితే.. జార్జ్ మరణించడానికి కారణం ఏంటి? అనేది తెలియాల్సి ఉంది. బాక్సింగ్ రింగ్ నుంచి వైదొలిగాక జార్జ్.. క్రైస్తవ మత బోధకుడిగా కొన్నాళ్లు సేవలందించాడు. దాంతో, ఆయన మరణవార్త విని పలువురు కంటతడి పెడుతున్నారు.





"జార్జ్ ఫొరెమాన్ ఒక మంచి బోధకుడు, మంచి భర్త, పిల్లల్ని ఎంతగానో ప్రేమించే తండ్రి. ఆయన తన జీవితాన్ని చాలా గొప్పగా గడిపారు. లక్షలాది మంది అభిమానుల నమ్మకం చూరగొన్న ఆయన మానవతావాదిగానూ ప్రసిద్ధి. రెండు సార్లు హెవీ వెయిట్ ఛాంపియన్ అయిన జార్జ్.. మరణంతో మా హృదయం ముక్కలైంది" అంటూ కుటుంబసభ్యులు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారు.

### 19 ఏళ్లకే ఒలింపిక్స్ పతకం

అమెరికాలోని టెక్సాస్‌లో 1949లో జన్మించాడు జార్జ్. చిన్నప్పుడే బడి మానేసిన అతడు.. వీధుల్లో తన ఈడు పిల్లలతో పోట్లాడేవాడు. అల్లరచిల్లరగా తిరుగుతున్న అతడు యవ్వనంలో బాక్సింగ్ మీద దృష్టి సారించాడు. తొలి టైటిల్ వేటలో మహ్మద్ అలీ చేతిలో కంగుతిన్న జార్జ్ 19 ఏళ్లకు తన శక్తిని ప్రపంచానికి చాటాడు. తన పంచ్ పవర్ చూపిస్తూ.. 1968లో జరిగిన ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలుపొందాడు. కెరియర్‌లో 76 మ్యాచుల్లో జార్జ్ విజేతగా నిలవగా.. వాటిలో ఏకంగా 68సార్లు నాకౌట్ చేయడం విశేషం. 28 ఏళ్లకే ఆటకు అల్విదా పలికి అందర్ని ఆశ్చర్యపరిచిన ఈ స్టార్ బాక్సర్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నాడు కూడా.

## ఈడెన్ గార్డెన్స్‌లో ఐపీఎల్ ఆరంభ వేడుకలు..





### షారుక్ ఖాన్‌తో స్టెప్పులేసిన కోహ్లీ

**కోల్‌కతా:** క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్న ఐపీఎల్ 18 సీజన్ ప్రారంభ వేడుకలు ఘనంగా జరిగాయి. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో సినీ తారలు, క్రికెట్ స్టార్లు.. ఆరంభ వేడుకల సంబురాన్ని అంబరాన్నంటేలా చేశారు. మొదటగా గాయని శ్రేయా ఘోషల్, పంజాబీ సింగర్ కరన్ హౌజ్లా తమ పాటలతో ఉర్రూతలూగించారు. వీళ్లు ఆలపిస్తుంటే స్టేడియం మొత్తం హోరెత్తిపోయింది. ఈ ఇద్దరి సంగీత ప్రదర్శన తర్వాత మైక్ అందుకున్న బాలీవుడ్ స్టార్ హీరో షారుక్ ఖాన్ తన యాంకరింగ్‌తో ఫ్యాన్స్‌ను అలరించాడు.

తమ ఫ్రాంచైజీ ఆటగాడు రింకూ సింగ్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మాజీ సారథి విరాట్ కోహ్లీలతో కలిసి స్టెప్పులు వేసిన బాద్‌షా అభిమానుల్లో జోష్ మరింత పెంచాడు. ఆ కాసేపటికి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్ని, సెక్రటరీతో పాటు ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్.. కుర్ర హృదయాల్లో కొలువైన దిశా పటానీని వేదికపైకి ఆహ్వానించాడు షారుక్.

బాణాసంచా వెలుగుల మధ్య డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్.. కెప్టెన్ అజింక్యా రహానే, ఆర్సీబీ సారథి రజత్ పాటిదార్ ట్రోఫీని వేదిక మీదకు తీసుకొచ్చారు. అనంతరం ఐపీఎల్ 18వ ఎడిషన్‌కు గుర్తుగా.. భారీ కేకును కోశారు. జాతీయ గీతం జనగణమన ఆలపించి.. వేడుకను ముగించారు. మరికాసేపట్లో అభిమానులతో కిక్కిరిసిన ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా, బెంగళూరు జట్ల మధ్య తొలి సమరం జరుగనుంది.

# అవకాశమిస్తే అదరగొడుతా..

### ఐపీఎల్‌పై స్టార్ పేసర్ ఆసక్తి!

**న్యూఢిల్లీ:** మరికొన్ని గంటల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. స్టార్ ఆటగాళ్ల బ్యాటింగ్ మెరుపులు, పేస్ బౌలర్ల బుల్లెట్ బంతులు.. బౌండరీ లైన్ వద్ద గాల్లోకి ఎగిరి క్యాచ్‌లు పట్టే ఫీల్డర్ల విన్యాసాలు. ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించనున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీలు తమ బెంచ్ బలాన్ని పెంచుకునే పనిలో నిమగ్నమయ్యాయి. గాయపడిన ఆటగాళ్ల స్థానంలో కొత్తవాళ్లను తీసుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో బంగ్లాదేశ్ స్టార్ పేసర్ తస్కిన్ అహ్మద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ యాజమాన్యం తనను సంప్రదించిందని శనివారం ఈ స్పీడ్‌గన్ వెల్లడించాడు.

"18వ సీజన్ ఐపీఎల్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ యాజయాన్యం నన్ను సంప్రదించింది. నేను అందుబాటులో ఉండడం, మా దేశ బోర్డు నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకునే విషయాన్ని వాకబు చేసింది. మెగా వేలంలో నాతో సహా మా దేశపు క్రికెటర్లను ఏ ఫ్రాంచైజీ కొనలేదు. దాంతో, ఐపీఎల్ ఆడే అవకాశం చేజారిందని అనుకున్నా. అయితే.. నిఖార్సైన పేసర్



కోసం వెతుకుతున్న లక్నో మేనేజ్‌మెంట్ నన్ను తీసుకోవాలనే ఆలోచనతో ఉంది. ఒకవేళ రీప్లేస్‌మెంట్‌గా ఎంచుకుంటే.. ఎన్‌ఓసీ వస్తుందా? లేదా? అనే అంశంపై మా మధ్య చర్చలు జరిగాయి. నేను ఫిట్‌గా ఉన్నానంటే ఎన్‌ఓసీ అనేది సమస్యనే కాదు. ఈ విషయం గురించి మా క్రికెట్ బోర్డుతో మాట్లాడాను. మళ్లీ లక్నో టీమ్ నుంచి నాకు ఫోన్ వస్తే.. బీసీబీ నన్ను విడుదల చేస్తుందనే ఆశాభావంతో ఉన్నాను" అని తస్కిన్ మీడియాకు వివరించాడు.

### ఒక మ్యాచ్‌లో 7 వికెట్లు

ఐపీఎల్‌లో ప్లే ఆఫ్స్ గండం దాటలేకపోతున్న లక్నో ఈసారైనా విజేతగా నిలవాలనే కసితో ఉంది. నాలుగేళ్లుగా ఊరిస్తున్న ట్రోఫీని ఒడిసి పట్టుకోవాలని జట్టు మేనేజ్‌మెంట్, ఆటగాళ్లు పట్టుదలతో ఉన్నారు. అయితే.. గత సీజన్‌లో నిప్పులు చెరిగిన యువ పేసర్లు మయాంక్ యాదవ్, మొహ్సిన్ ఖాన్‌ల గాయం లక్నోను కలవర పరుస్తోంది. దాంతో, వీళ్లు ఫిట్‌గా మారి.. జట్టుతో కలిసేంత వరకూ పేస్ యూనిట్ బరువు మోసేందుకు సీనియర్ బౌలర్ అవసరం. అందుకే.. అంతర్జాతీయ టీ20ల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన తస్కిన్ సేవల్ని వినియోగించుకోవాలని లక్నో యాజమాన్యం భావిస్తోంది. పొట్టి ఫార్మాట్‌లో చెలరేగిపోయే ఈ బంగ్లా పేసర్.. ఒక మ్యాచ్‌లో 7 వికెట్లు తీసి రికార్డు సృష్టించాడు. మొత్తంగా ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా చరిత్రకెక్కాడు.

# తెలుగులో సినిమా చేయకపోవడానికి కారణం అదే: విక్రమ్



టాకీస్: రంజిత్‌తో తంగలాన్ వంటి సూపర్ హిట్ అందుకున్న నటుడు చియన్ విక్రమ్ ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. ఇందులో భాగంగానే ఆయన నటిస్తున్న ఒక చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. విక్రమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వీర ధీర శూరన్'. ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను హెచ్.ఆర్.పిక్చర్స్ బ్యానర్‌పై రియా శిబు నిర్మిస్తుంది. ఈ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌ను వదలగా మంచి స్పందన తెచ్చుకుంది. అయితే విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో తాజాగా తెలుగులో ప్రమోషన్స్ నిర్వహించింది చిత్రయూనిట్.

ఈ వేడుకకు నటులు విక్రమ్‌తో పాటు ఎస్‌జే సూర్య వచ్చి సందడి చేశారు. అయితే వేడుకలో ఒక రిపోర్టర్ విక్రమ్‌ని అడుగుతూ.. తెలుగులో స్ట్రెయిట్ సినిమాలు ఎందుకు చేయట్లేదని అడుగుతాడు. దీనికి సమాధానంగా విక్రమ్ మాట్లాడుతూ.. దానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి మంచి కథ దొరకకపోవడం. మరోకటి.. ఇండియన్ సినిమా ఇండస్ట్రీ ప్రస్తుతం వరల్డ్ వైడ్‌గా పాకడం. పాన్ ఇండియా సినిమాల వలన నేను తమిళంలో చేసిన సినిమాను మీరు తెలుగులో ఇక్కడ చూస్తున్నారు. తెలుగులో వచ్చిన సినిమాలను నేను ఓటీటీలో తమిళంలో చూస్తున్నాను. ఇలా ఎక్కడ చేసిన చూసే భాష ఒకటే అవుతుంది కాబట్టి తెలుగులో చేయడం లేదంటూ విక్రమ్ చెప్పుకోచ్చాడు. ఈ చిత్రంలో మలయాళ విలక్షణ నటుడు సూరజ్ వెంజరముడ్‌తో పాటు ఎస్.జె.సూర్య, దుశరా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

# నల్ల కలువ అవతార్‌లో 'త్రిప్తి డిమ్రి'




టాకీస్: 'యానిమల్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన 'త్రిప్తి డిమ్రి' గత ఏడాది బ్యాక్ టు బ్యాక్ మూడు సినిమాల్లో నటించింది. ముఖ్యంగా ఈమె నటించిన భూల్ భులయ్యా 3 సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే యానిమల్ సినిమాలో ఓవర్ డోస్ శృంగార సన్నివేశాల్లో నటించి గుర్తింపు దక్కించుకోవడం వల్ల అన్ని సినిమాల్లోనూ అలాంటి పాత్రల్లో నటించే అవకాశాలు వస్తున్నాయట. దాంతో త్రిప్తి సినిమాల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. ఇటీవల ఒక స్టార్ హీరో సినిమాలో త్రిప్తి హీరోయిన్‌గా ఎంపిక అయి, ఆమెకు ఉన్న ఇమేజ్ కారణంగా తప్పించారనే వార్తలు వస్తున్నాయి. త్రిప్తి ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తోంది. ధడక్ 2 సినిమాతో పాటు ఇంకా టైటిల్ ఖరారు కానీ మరో సినిమాలోనూ త్రిప్తి ప్రస్తుతం నటిస్తోంది. ఆ రెండు సినిమాలతో ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద సందడికి సిద్ధం అవుతున్న త్రిప్తి తనపై ఉన్న ఇమేజ్‌ను తొలగించుకునే ప్రయత్నాలు చేస్తుంది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు వస్తే తప్పకుండా మెప్పిస్తాను అనే నమ్మకంతో ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పుకొచ్చింది. సినిమాల్లో అందాల తారగా కంటే ఉత్తమ నటిగా గుర్తింపు దక్కించుకోవడం కోసం ఎదురు చూస్తున్నట్లు త్రిప్తి చెప్పుకొచ్చింది. అంతే కాకుండా ఈమె సౌత్ సినిమాల్లోనూ నటించేందుకు రెడీ అంటూ ఒక ఇంటర్వ్యూలో ఓపెన్‌గానే చెప్పుకొచ్చింది. సినిమాల్లో బిజీ బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి త్రిప్తి బ్లాక్ డ్రెస్‌లో సర్‌ప్రైజ్ చేసింది. పెద్దగా స్కిన్ షో చేయకుండానే స్టైలిష్ లుక్‌లో త్రిప్తి ఆకట్టుకుంది. బ్లాక్ డ్రెస్‌లో చూపు తిప్పనివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్‌లో అందంగా ఉన్న త్రిప్తిని వెండి తెరపై శృంగార తార పాత్రలో చూసేందుకు ఎక్కువ శాతం మంది ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. ఫిల్మ్ మేకర్స్ సైతం అదే విధంగా ఆమెను చూపించాలని భావిస్తున్నారు. కానీ త్రిప్తి మాత్రం నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేసేందుకు ఎదురు చూస్తుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా బాలీవుడ్‌లోనే కాకుండా సౌత్‌లోనూ ఈ అమ్మడు సినిమాలు చేసే అవకాశాలు దక్కించుకుంటుంది అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. యానిమల్ సినిమా విడుదలైన వెంటనే ఒక సౌత్ సినిమాలో ఈమెకు ఆఫర్ వచ్చిందనే టాక్ వచ్చింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా పట్టాలెక్కలేదు. త్వరలోనే సౌత్‌లో ఈమె నటిస్తుందేమో చూడాలి. యానిమల్ సినిమాకు సీక్వెల్‌గా రాబోతున్న యానిమల్ పార్క్‌లో ఈమె పాత్ర ఏమైనా ఉండే అవకాశం ఉందా అంటూ పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# జయం తర్వాత నా కెరీర్‌లో మళ్లీ అలాంటి సినిమా 'ఎల్లమ్మ': నితిన్

**టాకీస్:** ఎల్లమ్మ సినిమా గురించి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు నటుడు నితిన్. తన కెరీర్‌లో జయం తర్వాత మళ్లీ అలాంటి సినిమా చేయబోతున్నానంటూ చెప్పుకోచ్చాడు. నితిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నాడు. భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ఈ సందర్భంగా వరుసగా ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రయూనిట్. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇంటర్వ్యూలో పాల్గొన్న నితిన్ తాజాగా తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్ ఎల్లమ్మ గురించి పంచుకున్నాడు.



ఎల్లమ్మ గురించి మాట్లాడుతూ.. ఎల్లమ్మ నా కెరీర్ లో జయం తర్వాత అంతకంటే లోకల్ రూటెడ్(గ్రామీణ నేపథ్యంలో) సినిమాగా రాబోతుంది. నేను ఎంత బాగా యాక్టింగ్ చేస్తే నాకు అంత పేరు వస్తుంది. ఇదోక మైల్ స్టోన్ సినిమా అని చెప్పవచ్చు. ఎల్లమ్మ అనే గ్రామ దేవత నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందంటూ నితిన్ చెప్పుకోచ్చాడు. ఈ సినిమాకు బలగం దర్శకుడు వేణు ఎల్దండి దర్శకత్వం వహించబోతుండగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మించబోతున్నాడు. సాయి పల్లవిని మొదటగా ఈ సినిమాకు కథానాయికగా అనుకోగా తాజాగా ఆమె తప్పుకున్నట్లు తెలుస్తుంది.

# హీరోతో డేట్ చేయకూడదని బాండ్ రాయించుకున్నారు: నిధి అగర్వాల్

టాకీస్: సవ్యసాచి సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది యువ కథానాయకి నిధి అగర్వాల్. ఈ సినిమా అనంతరం మిస్టర్ మజ్ను చేసిన కూడా రెండు సినిమాలు పెద్దగా బ్రేక్‌ని అందించలేకపోయాయి. అయితే పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్‌శంకర్'తో బ్లాక్‌బాస్టర్ హిట్ కొట్టేసింది ఈ భామ. ఆ తర్వాత తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఈ భామ తన కెరీర్ ప్రారంభంలో జరిగిన ఒక సంఘటన గురించి తాజాగా పంచుకుంది. తన మొదటి సినిమా టైంలో హీరోతో డేట్ చేయవద్దని చిత్రయనిట్ బాండ్ రాయించుకున్నారని తెలిపింది. బాలీవుడ్ సీనియర్ నటుడు జాకీ ష్రాఫ్ తనయుడు టైగర్ ష్రాఫ్ హీరోగా నటించిన 'మున్నా మైఖేల్' సినిమాతో బాలీవుడ్‌లో నా సినీ ప్రస్థానం మొదలైంది. ఈ సినిమాకు ఒకే చెప్పిన తర్వాత చిత్రయూనిట్ నాతో ఒక కాంట్రాక్ట్‌పై సంతకం చేయించింది. ఆ కాంట్రాక్ట్‌లో సినిమాకు సంబంధించి నేను పాటించాల్సిన నియమాలు ఉన్నాయి. అందులో'నో డేటింగ్' అనే షరతు కూడా ఉంది. దానికి అర్థం సినిమా కంప్లీట్ అయ్యేవరకు నేను హీరోతో నేను డేటింగ్ చేయకుడదని. అయితే ఇది చూడాకుండా నేను సంతకం పెట్టాను. తర్వాత ఈ విషయం తెలిసి నేను చాలా షాక్ అయ్యాను. నటీనటులు ప్రేమలో పడితే పనిపై శ్రద్ధ తగ్గుతుందని టీమ్ భావించి ఉంటుంది. అందుకే ఇలాంటి నిబంధనలు జోడించి ఉంటారని అనుకున్నానంటూ నిధి చెప్పుకోచ్చింది. సినిమాల విషయానికి వస్తే.. నిధి ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో కలిసి 'హరి హర వీరమల్లు' చిత్రంలో నటిస్తుంది. ఈ చిత్రం మే 09న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# సూర్య రెట్రో నుంచి 'కనిమా' సాంగ్ రిలీజ్




**టాకీస్:** తమిళ నటుడు సూర్య దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు, కాంబోలో వస్తున్న తాజా చిత్రం రెట్రో. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుంది. మలయాళ నటుడు జోజు జార్జ్, కరుణకరణ్, జయరామ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సమ్మర్ కానుకగా మే 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు మేకర్స్. రెట్రో నుంచి 'కన్నమ్మ' సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సంతోష్ నారాయణన్ స్వరపరిచిన ఈ గీతంలో అదిరిపోయే స్టెప్పులతో సూర్య- పూజల జంట ఆడియన్స్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నారు. గ్యాంగ్‌స్టర్ మారిన ప్రేమికుడిని అతడి ప్రేయాసి ఎలా బయటికి తీసుకువచ్చింది. తన ప్రేయాసి కోసం కథానాయకుడు ఏం చేశాడు అనేది సినిమా స్టోరీ. సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తన భార్య జ్యోతికతో కలిసి సూర్య ఈ సినిమాను నిర్మిస్తున్నాడు.

# బాలీవుడ్ అంత వీజీ కాదని తేల్చేసిన భామలు!



## సౌత్‌లో స్టార్స్ అనిపించుకున్న హీరోయిన్స్
## నార్త్‌లోను గట్టి ప్రయత్నాలు చేసిన బ్యూటీస్

**టాకీస్:** బాలీవుడ్‌కి శ్రీదేవి వెళ్లేవరకూ ఒక లెక్క .. వెళ్లిన తరువాత ఒక లెక్క అనే చెప్పుకోవాలి. సౌత్ ను ఒక రేంజ్ లో ఊపేసిన శ్రీదేవి ఆ తరువాత నార్త్ కి వెళ్లి, ఒక రేంజ్ లో సందడి చేసింది. శ్రీదేవి ఫీల్డ్ లో ఉన్నంత కాలం ఆమెను గురించి మాత్రమే మాట్లాడుకునేవారని అనడంలో అతిశయోక్తి లేదు. మాధురీ దీక్షిత్ .. ఐశ్వర్యారాయ్ లాంటి వారు వచ్చినా, శ్రీదేవిని మరిచిపోయేలా చేయలేకపోయారు. శ్రీదేవి తరువాత ఇక్కడి నుంచి వెళ్లి, అక్కడి వారిని ప్రభావితం చేసింది జయప్రద మాత్రమేనని చెప్పాలి.ఆ తరువాత కాలంలో హీరోయిన్స్ ఒకేసారి వివిధ భాషలో నటించడం మరింత ఎక్కువైపోయింది. తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ .. ఇలా ఎక్కడి నుంచి అవకాశం వచ్చినా వదలకుండా హీరోయిన్స్ సినిమాలు చేయడం మొదలుపెట్టారు. ఇక సౌత్ లో మంచి క్రేజ్ ఉంది గనుక, తాము ఉత్తరాదికి వెళ్లడానికి ఇదే కరెక్టు టైమ్ అన్నట్టుగా ఆ దిశగా ఓ అడుగువేశారు. అక్కడ పరిచయాలు పెంచుకుని పరిగెత్తడానికి ట్రై చేశారు. అలాంటి కథానాయికల జాబితాలో తమన్నా .. కాజల్ .. ఇలియానా .. శ్రుతి హాసన్ వంటి వారు ఉన్నారు.వీళ్లంతా కూడా తెలుగు .. తమిళ భాషల్లో స్టార్ స్టేటస్ ను అందుకున్నవారే. బాలీవుడ్ లో తమ హవాను కొనసాగించాలని భావించినవారే. అందరూ కూడా అడపాదడపా బాలీవుడ్ తెరపై అందంగా మెరిశారే తప్ప, చెప్పుకోదగిన స్థాయిలో తమదైన ముద్రను మాత్రం వేయలేకపోయారు. ఆలస్యంగానైనా అక్కడి వాతావరణాన్ని అర్థం చేసుకున్నారు. ఇక ఇప్పుడు అక్కడ పట్టు చిక్కించుకోవడానికి రష్మిక .. కీర్తి సురేశ్ ..గట్టిగానే ట్రై చేస్తున్నారు. సీనియర్ హీరోయిన్లను ఒక మాట అడిగితే, అదంతా వీజీ కాదని ఈ పాటికే చెప్పేవారేమో.







Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.